ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 7 జూలై 2024





ఇసుక ఉచితం

ప్రభుత్వం భారీ కసరత్తు

- ఎక్కడికక్కడ నిల్వలను గుర్తించి ఆ మేరకే రవాణా
- ఏలూరు జిల్లాలో ఇసుక నిల్వలు తక్కువే
- ముంపు మండలాల నుంచే ఉచిత ఇసుకకు ఆస్కారం
- పక్కాగా ప్లాన్ చేయండి : సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్
- ఎక్కడా ఏలోటు రాకూడదు : కలెక్టర్ వెట్రి సెల్వీ

ఏలూరు, జూలై 6: (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : బంగారంలాంటి ఇసుక సోమవారం నుంచి అందరికీ ఉచితం కానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తాము ఎన్నికల సమయంలో ప్రకటించినట్టుగా ఇసుకను ఉచితంగా ప్రజలకు అందజేయాలని తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగానే జిల్లాల వారీగా యంత్రాగాన్ని అప్రమత్తం చేసింది. ఉచిత ఇసుక సరఫరా విధి విధానాలపై సమీక్షించాల్సిందిగా ఆదేశించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాల్లో ఎక్కడెక్కడ ఇసుక నిల్వలు ఉన్నవి గుర్తించి, ఉచిత ఇసుక రవాణాకున్న ఆటంకాలను పూర్తిగా తొలగించాల్సిందిగా ఆదేశించారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే ఇసుక నిల్వలు ఇప్పటికే తక్కువగా ఉన్నాయి.

అధికారులేం చేయబోతున్నారంటే..

ఉచిత ఉసుక రవాణాకు సంబంధించి ఏలూరు జిల్లా యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాలు అమలుకు వీలుగా శనివారం నాడే చకచకా నిర్ణయాలకు దిగింది. జిల్లాలోని వివిధ ఇసుక స్టాక్ పాయింట్లలో నిల్వలు, ఆ వెనువెంటనే ఉచిత విధానం అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిగువ స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచే ఉచిత ఇసుక విధానం అమలులోకి రాబోతోంది. ఉంగుటూరు మండలం చేబ్రోలు, కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్లను యంత్రాంగం గుర్తించింది. ఇంతకుముందు మాదిరి కాకుండా సామాన్యులందరికీ ఇసుకను ఉచితంగా అందించాల్సిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎక్కడా అసంతృప్తి తలెత్తకుండా చట్టబద్ధమైన పన్నులు, లెవీలతో పాటు కార్యకలాపాల ఖర్చులు మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేయాలని, ఈ మేరకు ఎక్కడా ఆదేశాలు జవ దాటకూడదంటూ అధికారులకు స్పష్టతతో కూడిన ఆదేశాలు జారీ అయ్యాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగతంగా ఒక వ్యక్తికి ఒకరోజు 20 టన్నుల లోపే ఇసుకను అందించాలని ఖచ్చితమైన షరతు లు విధించారు. ఇసుక నిల్వ కేంద్రాల వద్ద నామమాత్రపు రుసుం వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత ఇసుక విధానాన్ని మైన్స్ అండ్ జియాలజీ, రెవెన్యూ, రవాణా, పోలీస్ తదితర శాఖలతో పర స్పర సమన్వయం నిక్కచ్చిగా ఉచిత ఇసుక సరఫరా చేయాలని మార్గదర్శక సూత్రాల్లో స్పష్టం చేశారు. ఎక్కడికక్కడ ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఉంచడం, ఆపై పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవా లని, ప్రతి స్టాక్ పాయింట్ వద్ద డిప్యూటీ తహసీల్దారు స్థాయి అధికారిని పర్యవేక్షణ ఉంచాలని అని ఆదేశించారు.

ఎక్కడా లోపాలు ఉండొద్దు : కలెక్టర్ వెట్రి సెల్వీ

ప్రజా అవసరాల మేరకు ఇసుక అందుబాటులో ఉంది. ప్రభుత్వ లక్ష్యమైన ఉచిత ఇసుక రవాణాలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్టంగా అమలు చేయాల్సిందిగా అధికారులను కలెక్టర్ వెట్రి సెల్వీ ఆదేశించారు. శనివారం నాడంతా కలెక్టర్ ఉచిత ఇసుక విధానంపై అటు అధికారులతోనూ, ఇటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ పాల్గొంటూ బిజీబిజీగా గడిపారు. ఇసుక ధరలను సహేతుకంగా నిర్ణయించడం తగ్గట్టుగానే ప్రజలు ఆశించినట్టుగా ప్రభుత్వ విధానాన్ని అమలు చేయడం తమ ముందున్న లక్ష్యంగా వివరించారు.




సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

• జాగ్రత్తలను పాటించండి : సీఎస్

రాష్ట్రంలో ఈనెల 8వ తేదీ నుంచి నూతన ఇసుక విధానం అమలు కావాలని, ఆమేరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఉదయం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌తో ఇసుక ఉచిత సరఫరా విధానంపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం నుంచే ఉచిత ఇసుక సరఫరా విధానం ప్రారంభం కావాలన్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఏర్పాటు చేసి ధరలను నిర్ణయించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారానే వినియోగదారుడు చెల్లింపులు చేయాలని, ముందుగా వచ్చిన వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలను బట్టి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లకు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్‌లతో పాటు కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించి, అందుబాటులోకి తీసుకురావాలని ఇసుక రవాణాకు అవసర మైన ఇంటర్నల్, కన్స్యూమర్ పర్మిట్ల విషయంలోనూ జాగ్రత్తలు పాటించాల్సిందేనని ఆయన ఆదేశించారు.

గోదావరి పెరుగుతోంది



వరద జలాలతో పోలవరం స్పిల్‌వే

పోలవరం/ఆచంట, జూలై 6 : పోలవరంలో గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పోలవరం ప్రాజెక్టు ఎగువన కొండవాగులు, గోదావరి ఉపనదులైన శబరి, మంజీర, ప్రాణహిత, సీలేరు నదుల జలాలు గోదావరిలో కలుస్తుండడం వల్ల నీటిమట్టం పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న గోదావరి జలాలను 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.470 మీటర్లు, దిగువన 16.480 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాంకి ఎగువన 26.520 మీటర్లు, దిగువన 15.340 మీటర్లు నీటి మట్టం నమోదైనట్లు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం 15.177 మీటర్లునమోదైందని , గోదావరిలోకి 49,441 క్యూసెక్కుల వరద జలాలు చేరుకున్నాయని సీడబ్ల్యూసీ సిబ్బంది ఆర్.నవీన్ నాయుడు తెలిపారు.

పట్టిసీమలో 6,018 క్యూసెక్కుల విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ కు విడుదల చేసినట్లు ఎత్తిపోతల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు శనివారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటి మట్టం 14.750 మీటర్లకు చేరుకుందని ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు 12 పంపులు 17 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ 0.8460 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

ఇసుక ర్యాంపులపై ప్రభావం

భారీ వర్షాల కారణంగా వరద నీరు గోదావరిలోకి వస్తుండటంతో కళకళలాడుతోంది. కోడేరు ఇసుక తిన్నెలు నీట మునిగాయి. కోడేరు వద్ద ఉన్న ఇసుక ర్యాంప్ నీట మునిగింది. ఇప్పటి నుంచి రానున్న రోజుల్లో గోదావరిలో నీరు వచ్చి వెళుతూ ఉంటుంది. దీంతో ఇసుక తవ్వకాలకు ఇబ్బం ది కలుగుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వం ఉచిత ఇసుక పథకానికి శ్రీకారం చుట్టనుంది. అయితే ప్రస్తుతం గోదావరిలోకి నీరు వస్తుండటంతో ఇప్పట్లో ర్యాంప్‌లు ప్రారంభమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

జగనన్న భూరక్ష.. రైతులకు శిక్ష!

- ఇష్టానుసారంగా భూ రికార్డుల మార్పిడి
- నిలిచిన భూముల లావాదేవీలు
- అత్యవసర పరిస్థితుల్లో అమ్ముకోలేక అన్నదాతలు ఇబ్బందులు



కాట్లంపూడిలో జగనన్న భూరక్ష పేరుతో వేసిన రాయి

ఏలూరు రూరల్, జూలై 6 : జగనన్న భూరక్ష పేరుతో గత ప్రభుత్వం చేసిన రీ సర్వే రైతుల పాలిట శిక్షగా మారింది. అనాలోచిత నిర్ణయాలతో గత పాలకులు చేసిన ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) విధానం కారణంగా చాలాచోట్ల భూముల లావాదేవీలు స్తంభించిపోయాయి. దీంతో అవసరాల కోసం అమ్ముకోవాలనుకుంటున్న అన్నదాతలు ఆ వీలులేక ఆవేదన చెందుతున్నారు. అనాదిగా భూముల లావాదేవీలు ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్, జగనన్న భూరక్ష పేరుతో రీసర్వే చేస్తామంటూ ప్రకటించి ముందుగా కొన్ని పంచాయతీలను ఎంపిక చేసింది. ప్రజాధనం వెచ్చించి జగన్ మోహన్‌రెడ్డి తన పేరుతో సర్వే రాళ్లను సిద్ధం చేశారు. జిల్లాలోని అనేక పంచాయతీల్లో రీసర్వేలు చేశారు. గతంలో ఉన్న సర్వే నెంబర్లు, ఫీల్డ్ మ్యాప్‌లను రీసర్వే పేరుతో పక్కన పెట్టారు. ఆయా గ్రామాల్లోని రైతులకు సర్వే నెంబర్లకు బదులుగా ఎల్‌పీఎం నెంబర్లను కేటాయించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న భూముల విస్తీర్ణాన్ని ఆన్‌లైన్‌లో గందరగోళంగా మార్చేశారు. ఒక రైతుకు ముందున్న భూమి విస్తీర్ణం కన్నా పెంచడం, లేదా తగ్గించడం చేశారు. భూములు కొలతలు తగ్గిపోయిన రైతులు మొత్తుకున్నా పట్టించుకోకుండా ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చేశారు. మరికొందరికి ఉన్న భూమికన్నా ఎక్కువ విస్తీర్ణం నమోదు చేశారు. గతంలో ఎవరైనా స్కెచ్‌కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు వెంటనే ఇచ్చేవారు. రీసర్వే తర్వాత ఎవరి భూములకు స్కెచ్ ఇచ్చేందుకు వీలు లేకుండా చేశారు. భూముల లావాదేవీలు స్తంభించిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గ్రామాల్లో జగనన్న భూరక్ష సర్వే జరిగింది. ఆయా చోట్ల చాలామంది రైతులు కొద్దినెలల క్రితం పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు ఇతర అత్యవసర పరిస్థితులు నేపథ్యంలో తమ భూములను విక్రయించుకున్నారు. కొద్దినెలల వ్యవధితో ఒప్పంద పత్రం రాసుకుని విక్రయించారు. ప్రస్తుతం అలాంటి విక్రయ ఒప్పందాలు రిజిస్ట్రేషన్‌కు దగ్గర పడ్డాయి. ఇలాంటి వారు భూములు రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించడం, అది ఆన్‌లైన్‌లో అస్తవ్యస్తంగా నమోదు కావడం, ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో చిక్కులు ఏర్పడ్డాయి. పాత సర్వేనెంబర్ లేకుండా ఎల్‌పీఎం నెంబర్లు ఉండడం దానికి కూడా డిజిటల్ లాక్ అడ్డుగా ఉండడంతో రిజిస్ట్రేషన్లు చేసేందుకు వీలులేకుండా పోతోంది. ప్రస్తుతం అత్యవసరం కోసం తమ భూములు అమ్ము కోవాలి అనుకునే వారికి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.



చిగురుకోటలో పోలీస్ పికెట్

ముదినేపల్లి, జూలై 6 : మండలంలోని చిగురుకోటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈనెల 3వ తేదీన గ్రామంలో నడక దారి విషయమై అన్నదమ్ముల మధ్య ఏర్పడిన వివాదంలో కత్తిపోట్లకు గురై పరసా దేవి అనే మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు. కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ గ్రామంలో కేసు దర్యాప్తు నిర్వహించి హత్య కేసు నమోదు చేశారు. గుడివాడ ప్రభుత్వాస్పత్రిలో దేవి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

పీహెచ్‌సీ వైద్యుడికి మెమో

జీలుగుమిల్లి, జూలై 6 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా పనిచేస్తున్న హదీద్‌కు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మెమో జారీ చేసింది. ఇటీవల పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆస్పత్రిని సందర్శించిన సమయంలో హదీద్ విధుల్లో లేకపోవడంపై ఆరా తీశారు. దీంతో పాటు విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా డీఎంహెచ్‌వో శర్మిష్ఠ మెమో జారీ చేశారు. అయితే వివరణ ఇచ్చే క్రమంలో కొద్ది రోజులుగా హదీద్ జాప్యం చేస్తూ వస్తున్నారు. దీంతో ఆయన్ని డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు ఎటాచ్ చేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

12 గంటలు అంధకారంలో..

పోలవరం, జూలై 6 : పోలవరంలో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు 12 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పోలవరం గ్రామంలో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా లేక ఒకవైపు దోమలు, మరోవైపు ఉక్కబోతతో ప్రజానీకం, వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బంది లకు గురయ్యారు. విద్యుత్ శాఖ సిబ్బంది పంట పొలాల్లో పొదల మధ్య జోరున కురుస్తున్న వర్షంలో ఆరు గంటల సేపు శ్రమించి అంతరాయానికి కారణమైన విద్యుత్ లైన్లను సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరిం చారు. తరచూ అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులకు గురవుతున్నామని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఏమయ్యారు?

గత ఐదేళ్లలో 1,924 మంది మహిళలు అదృశ్యం.. ఇంకా ఆచూకీ లేని 64 మంది

ఇంటి యజమానులు ఎంత కష్టపడినా సాయంత్రానికి తన కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరుకుంటారు. తమకు ఉన్నదానితోనే వారు ఆనంద జీవితం గడిపేస్తుంటారు. అటువంటి కుటుంబంలో ఆకస్మాత్తుగా ఒక ఆడబిడ్డ కన్పించకుండా పోతే కుటుంబ సభ్యులు ఎంతగా తల్లడిల్లుతారో అర్థం చేసుకోవచ్చు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో అదృశ్యమైన మహిళల్లో ఇప్పటికి 64 మంది ఆచూకీ లేకుండా పోయారు. అప్పట్లో పోలీసులను ఆశ్రయించినా స్పందన లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో పోలీస్ యంత్రాంగంలో కదలిక వచ్చింది. అసలు వీరంతా ఏమయ్యారని దర్యాప్తు చేపట్టారు.

- వైసీపీ పాలనలోనే అదృశ్యం కేసులెక్కువ
- అప్పట్లో ఎన్నికల ప్రచారంలో ఇదే విషయం పవన్ కల్యాణ్ ప్రస్తావన..
- నేడు డిప్యూటీ సీఎం హోదాలో చర్యలకు ఉపక్రమణ
- ఫైళ్ల దుమ్ము దులుపుతున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూలై 6 : ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో ప్రేమ పేరుతో యువతులు సులువుగా మోసపోతున్నారు. ప్రేమించిన వాడి మాట కాదనలేక తల్లిదండ్రులను వద్దనుకుని కొద్దిరోజుల కిందట పరిచయం అయిన వాడితోనే ప్రయాణం కట్టేస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె కన్పించకపోవడంతో ఆ ఇల్లు ఒక్కసారిగా చీకటిమయంగా మారుతోంది. ఎవరికైనా చెప్పుకుంటే తమ పరువు పోతుందని కుమిలిపోతూ కొన్ని కుటుంబాలు ఫిర్యాదులు చేయకుండా ఉండిపోతున్నారు. మరి కొన్ని కుటుంబాలు ఫిర్యాదు చేసినా తమ బిడ్డ ఆచూకీ తెలియక తల్లడిల్లిపోతున్నారు. మరి కొంతమంది చదువులో విఫలం అవ్వడమో, లేదా ఇతర కారణాలతో ఇంకా ఈ ప్రాంతంలో ఉండలేను అన్నట్లు ఇల్లు విడిచి చెప్ప పెట్టకుండా వెళ్ళిపోతు న్నారు. అలాంటి వారి వల్ల ఆ కుటుంబాలు అయోమయంలో పడుతున్నాయి. ఇదిలా ఉండగా ఉద్యోగాల పేరుతో కొందరు మోసగాళ్లు యువతులకు మాయమాటలు చెప్పి మహానగరాలకు తరలిస్తూ అక్కడ వ్యభిచార గృహాలకు విక్రయించేస్తున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడిన సందర్భంలో కొంతమంది భార్యలు తన బిడ్డలను తీసుకుని ఇల్లు విడిచి వెళ్లిపోతున్నారు. వీరిలో కొందరి ఆచూకీ తెలియకుండా పోతోంది.

అదృశ్యమంటే.. చులకన భావనే

తమ బిడ్డ అదృశ్యమైందని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తే మేజరా, మైనరా అంటూ ప్రశ్నించడమే కాకుండా ఎవరితో ఒకరితో ప్రేమాయణంలో ఉండి ఉంటాదని, ఆచూకీ ఎక్కడైనా ఉంటే వెతికి మీరే చెప్పండి అంటూ ఫిర్యాదు చేసిన వారిని కొంతమంది పోలీసులు చులకన భావనతో చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక పెళ్లయిన మహిళ అదృశ్యమైతే ముందుగా వివాహేతర సంబంధాలే అంటగడు తున్నారు. పెళ్ళై పిల్లలతో ఉన్న ఆవిడ ఎక్కడో ఒక దిక్కున ఉంటాదో అని చెప్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పోలీసులపై విమర్శలు ఉన్నాయి. అయినవారు కానరాక ఆ కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. తమ బిడ్డలు ఎక్కడ ఉన్నా బతికి ఉన్నారనే సమాచారం ఉంటే చాలని ఆ కుటుంబ సభ్యులు ఆశగా వారి క్షేమ సమాచారం కోసం ఎదురు చూస్తున్నారు.

వైసీపీ పాలనలోనే ఎక్కువ అదృశ్యాలు

తెలుగుదేశం ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న సమయంలో జిల్లాలో 1,084 కేసులు నమోదు కాగా మహిళలు, యువతులు, బాలికలు 1,121 మంది అదృశ్యమయ్యారు. వారిలో 1112 మంది ఆచూకీని అప్పట్లోనే కనుగొన్నారు. ఇంకా 9 మంది ఆచూకీ మాత్రమే తెలియాల్సి ఉంది. వైసీపీ పాలనలో 2019 నుంచి 2024 మే నెల వరకు 1,820 అదృశ్యం కేసులు నమోదు కాగా బాలికలు, యువతులు, మహిళలు 1,924 మంది అదృశ్యం అయ్యారు. వారిలో 1,860 మంది ఆచూకీని కనుగొన్నారు. ఇంకా 64 మంది ఆచూకీని కనుగొనలేకపోయారు.



డిప్యూటీ సీఎం ప్రకటనతో పోలీస్ శాఖలో చలనం

ఎన్నికల సమయంలో జనసేన పార్టీ అధినేతగా పవన్ కల్యాణ్ ఏలూరు పాతబస్టాండ్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో వలంటీరు వ్యవస్థ పెట్టిన తర్వాతే అదృశ్యం కేసులు ఎక్కువ అయ్యాయని, ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని కొంత మంది ఫిర్యాదులు కూడా చేయలేకపోతున్నారని ధ్వజమెత్తారు. అంతేకాకుండా ఒంటరిగా ఉన్న యువతులు, మహిళల వివరాలను వలంటీర్ల ద్వారా తెలుసుకుని వైసీపీ నాయకులు వారిని ఉపాధి పేరుతో ఇతర మహానగరాలకు తరలిస్తున్నారని విమర్శలు చేశారు. ఆ ప్రకటనతో అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉలిక్కిపడేలా చేసింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడం, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో భీమవరానికి చెందిన ఒక యువతి అదృశ్యం అయితే తొమ్మిది నెలల నుంచి పోలీసులు పట్టించు కోవడం లేదంటూ ఆ యువతి తల్లి దండ్రులు పవన్ కల్యాణ్ ముందు తమ గోడు వినిపించారు. ఆయన ఆదేశాలతో వారం తిరగకుండానే ఆ యువతిని తీసుకొచ్చి పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రతి జిల్లాలో బాలికలు, మహిళలు, యువతుల అదృశ్యం కేసులపై ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామని, ఎక్కడెక్కడ ఏ కేసులు అదృశ్యమైనవి, పెండింగ్‌లో ఉన్నాయో దర్యాప్తు చేయిస్తామంటూ ప్రకటన చేయడంతో పోలీసుల్లో చలనం వచ్చింది. తమ ప్రాంతంలో నమోదైన కేసుల ఫైళ్ళను దుమ్ముదులిపి మరీ బయటకు తీస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్‌లో చూసినా క్షణాల్లో ఆ మిస్సింగ్ కేసు వివరాలను చెప్పే విధంగా అధికారులు సన్నద్ధమయ్యారంటే ఏ రకంగా దృష్టి పెట్టారో అర్థం చేసుకోవచ్చు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ/పోలవరం, జూలై 6 : జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కొనసాగుతున్నాయి. పోలవరంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీగా వర్షం కురిసింది. మెయిన్ రోడ్డు, బెస్తావీధి, కొత్తపేట, బాపూజీ కాలనీలలో డ్రెయినేజీ వ్యవస్థ సరిలేక నీరు నిలిచింది. మండలంలోని పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.జిల్లాలో గడచిన 24 గంటల్లో బుట్టాయిగూడెం మండలంలో 50 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో గడచిన 24 గంటల్లో సరాసరి వర్షపాతం 15.2 మి.మీ నమోదైంది. ఆగిరిపల్లిలో 36.4, లింగపాలెం 34.4, కొయ్యలగూడెం 30.2, జంగారెడ్డిగూడెం 29.8, పోలవరం 29.2, టి.నరసాపురం 28.4, నూజివీడు 23.6, చాట్రాయి 22.2, జీలుగుమిల్లి 19.8, కైకలూరు 18.6, చింతలపూడి 16.6, వేలేరుపాడు 15, మండవల్లి 12.4, కుక్కునూరు 12, పెదపాడు 8.8, పెదవేగి 8.8, కలిదిండి 6.4, ముసునూరు 6, కామవరపుకోట 5.2, ఏలూరు రూరల్ 4.8, ఏలూరు అర్బన్ 4.6, నిడమర్రు 1.2, ముదినేపల్లిలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



జిల్లా కోర్టు ఆవరణంలో మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి

మొక్కలతో కాలుష్య నివారణ


- జిల్లా జడ్జి సి.పురుషోత్తమకుమార్

ఏలూరు క్రైం, జూలై 6 : ప్రస్తుత సమాజంలో కాలుష్యం పెరిగిపోయిందని మొక్కలను నాటడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని శనివారం ఉదయం జిల్లా జడ్జి ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాలుష్యాన్ని తగ్గించడానికి తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని సూచించారు. ఏలూరు బార్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు : జేసీ

ఏలూరు సిటీ, జూలై 6 : వివిధ నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ధరల నియంత్రణలో భాగంగా శనివారం జేసీ అధ్యక్షతన జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ బియ్యం, పప్పు దినుసులు, పంచదార వర్తకుల యాజమాన్యం అధ్యక్ష, కార్యదర్శులు, సెక్రటరీ యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. బహిరంగ మార్కెట్ కంటే బియ్యం , కందిపప్పు , పంచదార చౌకధరలతో ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిందిగా జేసీ కోరారు. ధరలను నియంత్రించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని సమావేశానికి హాజరైన వారిని కోరారు. డీఎస్‌వో ఎస్ఎస్ సత్యనారాయణ రాజు, ఏఎస్‌వో వై ప్రతాప్‌రెడ్డి, వర్తక సంఘ ప్రతినిధులు నేరెళ్ళరాజేంద్ర, మద్దుల కుమార్, కేవీ సుబ్బారావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలి : ఎమ్మెల్యే చంటి



ఏలూరు టూటౌన్, జూలై 6 : పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. ప్రపంచ జునో సిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పెన్షన్‌లైన్ వెటర్నరీ ఆస్పత్రి వద్ద పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంపుడు కుక్కల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాక్సినేషన్‌పై వైద్యులు బాధ్యతగా పెంపుడు కుక్కల యాజ మానులకు అవగాహన కల్పించా లన్నారు. పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 82 వెటర్నరీ ఆస్పత్రుల్లో 17 వేల డోసులు పెంపుడు కుక్కలకు వేశామన్నారు. జిల్లాకు 31 వేల డోసులు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. వారం రోజుల పాటు వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తామన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు


పమేరియన్ బ్రీడ్.. పేరు సాయి స్నూఫి


ల్యాబ్ జాతి పేరు చార్లి

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచితంగా వ్యాక్సిన్


సిల్కి.. పేరు చింటు


గోల్డెన్ రిట్రీవర్ జాతి.. పేరు రోలెక్స్


రాట్‌వైలర్ జాతి.. పేరు లియో

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వెటర్నరీ ఆసుపత్రుల వద్ద పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు శనివారం వేశారు. ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు తీసుకుని ఏడాదికి ఒక్కసారి రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని ఆయా జిల్లాల వెటర్నరీ అధికారులు సూచించారు. ఏలూ రులో ఉచిత వ్యాక్సిన్ వేయించేందుకు కుక్కలను తీసుకొచ్చిన వాటి యజమానుల దృశ్యాలు.

- ఏలూరుటూటౌన్


అత్తిలి పశువైద్యశాలలో..


పమేరన్ జాతి.. పేరు జిమ్మి

అన్ని రంగాల్లో రాష్ట్రానికి అన్యాయం

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నూజివీడు టౌన్, జూలై 6 : మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో రాష్ట్రానికి అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూజివీడు అమర్ భవన్‌లో రాష్ట్రస్థాయి మేధో మథన సమాలోచన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'పదేళ్ల మోదీ పాలనలో ఏ ఒక్క సమస్య పరిష్కరించ లేదు. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ఏ రాష్ట్రానికి లేని అవకాశం ఆంధ్రరాష్ట్రానికి ఉంది. టీడీపీ మద్దతు పార్లమెంట్‌లో, వైసీపీ మద్దతు రాజ్యసభలోనూ అవసరం ఉంది. రాష్ట్రంలో గొడవ పడుతున్న ఈ పార్టీల నాయకులు కేంద్రంలో మోదీకి సలామ్ కొడుతున్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ఇరుపక్షాలపై ఉంది. కమ్యూనిష్టు పార్టీలు కార్మికుల పార్టీలుగా గుర్తింపు పడ్డాయి. కార్మికులు, ఉద్యోగులు మెరుగైన జీవితాలు సాగిస్తున్నారంటే దానికి కారణం కార్మిక సంఘాల కృషి కారణం. కార్మికవర్గం ఆర్థిక అంశాలు సాధించుకోవడానికి ఎర్రజెండా పడుతున్నారు. కాని అనంత రం పలు మార్గాలను ఎంచుకుంటున్నారు. సమాజంలో మార్పు రావాలన్నా దేశ రాజకీయాలు మారాలన్నా, కార్మికవర్గం కమ్యూనిష్టు పార్టీల వైపు ఉండా లి. రాష్ట్రంలో గత ఐదేళ్ల నియంత పాలన సాగింది. వ్యవస్థలు అన్ని కుప్ప కూలి రాష్ట్రం అప్పుల పాలైంది'.. అని విమర్శించారు. రాష్ట్ర ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, జి.ఓబులేషు, రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడగాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

భీమవరం అర్బన్, జూలై 6: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని అడిగే అవకాశం ఉన్నా ఎందుకు అడగడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు ప్రశ్నించారు. శని వారం పుచ్చలపల్లి సుంద రయ్య భవనంలో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల కంటే ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతు తగ్గిందన్నారు. మిత్రుల సహకా రంతో మోదీ అధికారంలోకి వచ్చారని గుర్తించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు అడుగుతారని ప్రశ్నించారు. గత ముఖ్య మంత్రిలా లొంగుబాటు తత్వంతో కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం నేత శ్రీనివాసరావు

చెస్ ఆర్బిటర్ నార్మ్ సాధించడం ఆనందంగా ఉంది

» జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్


ఎం.కిషోర్

భీమవరం అర్బన్, జూలై 6: ఇంటర్నేషనల్ చెస్ ఆర్బిటర్ నార్మ్ సాధించడం ఆనందగా ఉందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ ఫీట్‌ను సాధించిన మొదటి జిల్లా వాసిగా రికార్డు సాధించారు. ఇప్పటికే ప్రపంచ చదరంగ సమాఖ్య నుంచి ఫీడే ఆర్బిటర్‌గా వ్యవహరిస్తున్నారు. గత నెలలో భీమవరంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫైడ్ రేటింగ్ టోర్న మెంట్‌లో ఆర్బిటర్‌గా వ్యవహరించిన కిషోర్ మొదటి ఇంటర్నేషనల్ ఆర్బిటర్ నార్మ్ సాధించినట్టు తెలిపారు. భవిష్యత్తులో గ్రాండ్ మాస్టర్ టోర్నమెంట్లో ఆర్బిటర్‌గా వ్యవహరించి నార్మ్ సాధించడమే లక్ష్యం అన్నారు.

కియా ఇండియాలో ఉద్యోగాలకు ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 6 : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిప్లమో, బీటెక్ చదివిన అభ్యర్థులకు కియా ఇండియా సంస్థలో శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 2019-24లో డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణత సాధించి, వయస్సు 18-25 ఏళ్లలోపు వున్నవారు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి స్టయిఫండ్ ఇస్తారని, అనంతపురం జిల్లా పెనుకొండలోని కియా ఇండియాలో ఐదురోజుల శిక్ష ణ పూర్తి చేసిన అనంతరం ట్రైనీలుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు కియా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ 76589 02296 నంబరులో సంప్రదించాలని కోరారు.

వ్యవసాయరంగానికి కేవీకేలు కీలకం

ఉండి, జూలై 6 : వ్యవసాయరంగంలో రైతులను బలోపేతం చేయడంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఉండి కేవీకే ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. శనివారం ఉండి కేవీకేలో శాస్త్రవేత్తలు, రైతులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేవీకేను ఏర్పాటు చేసి 50 ఏళ్ల పూర్తయిందని, రైతుల భాగస్వామ్యంతో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేశంలో మొట్టమొదటి కృషి విజ్ఞాన కేంద్రం 1974 మార్చి 21న పుదుచ్చేరిలో ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు 731 కేవీకేలు ఏర్పాటు అయ్యాయన్నారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా స్వర్ణోత్సవ జ్యోతి యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ జ్యోతి రంపచోడవరం మండలం పందిరిమామిడి కేవీకే నుంచి ప్రారంభమై తాడేపల్లిగూడెంలోని వెంకట్రామన్నగూడెం చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి ఉండి మండలం కేవీకేకు ఆదివారం చేరుకుంటుదన్నారు. ఈనెల 8న కేవీకేలో వరి విత్తనోత్పత్తి చేస్తున్న రైతులకు, పకృతి వ్యవసాయం చేస్తున్నవారికి సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 9న వీరవాసరం మండలం మత్స్యపురిలో వరి, మత్స్య రైతులకు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

కాల్వలోకి దూకిన యువతి.. కానరాని ఆచూకీ

ఉంగుటూరు, జూలై 6 : నారాయణపురం వంతెన వద్ద ఈనెల రెండో తేదీన ఓ యువతి ఏలూరు ప్రధాన కాల్వలో దూకగా ఇంతవరకు ఆచూకీ లభించలేదు. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమవరానికి చెందిన పెచ్చెట్టి ఝాన్సీ (20) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా ఉంటూ జీవితం మీద విరక్తి చెంది రెండో తేదీన నారాయణపురం వద్ద ఏలూరు కాల్వలో దూకగా ఆమె ఆచూకీ కోసం చేబ్రోలు పోలీసులు, నిడమర్రు సీఐ మోగంటి వెంకటసుభాష్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఫైర్ సిబ్బందితో గాలింపు జరిపినా ఆచూకీ లభించలేదు. దీనిపై ఎస్ఐ ఎ.మణికుమార్ మాట్లాడుతూ ఆమె ఆచూకీ లభ్యమయ్యేవరకు గాలింపు చర్యలు జరుపుతామన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ ఎల్‌వీ సాగర్‌పై దాడి

చర్చి గొడవలే కారణం.. దాడికి పాల్పడింది చర్చి కమిటీ సభ్యుడు

ఏలూరు క్రైం, జూలై 6: చర్చి గొడవల నేపథ్యంలో రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఏలూరు మండల డిప్యూటీ తహసీల్దార్ ఎల్‌వీ విద్యాసాగర్‌పై ఓవ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులకు, ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు విద్యాసాగర్ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం వివరాలివి.. ఎల్‌వీ సాగర్ గత కొన్నేళ్ళ నుంచి ఏలూరు అమీనాపేటలో ఉన్న లూథర్ చర్చి కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఇటీవల ఏలూరు విద్యానగర్‌కు చెందిన ఎల్లంకి సునీల్‌కుమార్ కూడా చర్చి కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. చర్చికి సంబంధించిన వాట్సాప్ గ్రూపులో విద్యాసాగర్‌ను అవమానపరిచే విధంగా మెస్సేజ్‌లను సునీల్‌కుమార్ పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో దీటుగా ఆయన కూడా మెసేజ్‌లు పెట్టారు. చర్చిలో సునీల్‌కుమార్ వల్ల తగాదాలు ఏర్పడుతున్నాయని అతడిని కమిటీ నుంచి తొలగించాలంటూ చర్చి పాస్టర్ ఇర్మియాకు, బిషప్‌లకు కమిటీ వారికి సాగర్ ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో సాగర్‌పై కక్ష పెంచుకున్న సునీల్ కుమార్ దాడికి పాల్పడ్డాడు. శనివారం ఉదయం ఏలూరు ఇండోర్ స్టేడియంలో సాగర్ వాకింగ్‌కు వెళ్లి తిరిగి బయటకు వచ్చిన సమయంలో సునీల్‌కుమార్ కారులో మరో ముగ్గురు వ్యక్తులను తీసుకువచ్చి బెదిరింపు చూపులు చేశాడని అయితే అక్కడ ప్రజలు ఎక్కువ మంది ఉండడంతో వెళ్ళిపోయాడని చెప్పారు. చివరకు అశోక్‌నగర్‌లోని తన ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లే సమయంలో కారులో వచ్చిన సునీల్‌కుమార్ కత్తితో దాడికి ప్రయత్నించగా చేయి అడ్డు పెట్టుకోగా చేయి తెగిందని చర్చి గొడవల నేపథ్యలో ఘర్షణకు దిగి దాడి చేశారని వాంగ్మూలంలో పేర్కొన్నారు. అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పొంది ఎమ్మెల్సీగా నమోదు చేశారు. ఔట్‌పోస్టు పేషెంటుగానే వైద్య సేవలు అందించారు.

శ్రీవారికి ఎంపీ పురందేశ్వరి దంపతుల పూజలు

ద్వారకాతిరుమల, జూలై 6 : ద్వారకాతిరుమలేశుని ఆలయాన్ని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలసి వచ్చిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. తొలుత ఆమె ఆలయంలోకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో ఆమెకు, ఆమె భర్త వెంకటేశ్వరరావుకు, స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటికి అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. ఆలయ ట్రస్టీ ఎస్‌వీ నివృతరావు, ఈవో త్రినాథరావు వారికి స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు. కూటమి నేతలు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీనివాసరావు, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మొగతడకల శ్రీనివాసరావు, ఏపూరి దాలయ్య, డీఎస్ చౌదరి, నాదెళ్ల సురేంద్ర, పలువురు బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

భక్తులతో శ్రీవారి క్షేత్రం కళకళ

ఆషాఢమాసం తొలిరోజు కావడంతో పాటు స్వామికి ఇష్టమైన రోజు కావడంతో చినవెంకన్న స్వామి క్షేత్రం శనివారం భక్తులతో కళకళలాడింది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో నిండిపోయాయి. మధ్యాహ్నం సమయానికి భక్తుల సంఖ్య పెరగడంతో దాదాపు 15 వేల మంది వరకు ఆలయానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకుని స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.


ఎంపీ పురందేశ్వరి దంపతులు, ఎమ్మెల్యే మద్దిపాటికి శ్రీవారి చిత్రపటాలను అందిస్తున్న ట్రస్టీ, ఈవోలు


భక్తుల రద్దీ

'వశిష్ఠ వారధి' నరసాపురం మీదుగా సాగాలి

» కేంద్ర మంత్రికి మాజీ ఎమ్మెల్యే బండారు విన్నపం

నరసాపురం, జూలై 6: నరసాపురం మండలం రాజుల్లంక వద్ద ప్రతిపాదించిన వశిష్ఠ వారధి నిర్మాణ రూట్ మ్యాప్‌ను మార్చాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మకు శనివారం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు కోరారు. ఢిల్లీ కార్యాలయంలో ఆయనను కలిసి గత ప్రభుత్వ హయాంలో వారధి నిర్మాణ రూట్ మ్యాప్ మారిందన్నారు. గతంలో ఈ వారధిని శివకోడు నుంచి మల్కీపురం, నరసాపురం పట్టణం మీదుగా లాకుల వద్ద 216 జాతీయ రహదారి కలిసే విధంగా ప్రతిపాదించామన్నారు. రాష్ట్ర విభజన తరువాత అప్పటి కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. అయితే గత ప్రభుత్వం కోనసీమ జిల్లాలోని రామేశ్వరం, నరసాపురం మండలం రాజుల్లంక వద్ద వారధి నిర్మాణం జరిగేలా రూట్‌మ్యాప్‌ను ఖరారు చేసిందన్నారు. దీని వల్ల కోనసీమ జిల్లాలోకి వెళ్లాలంటే పట్టణం నుంచి ఏడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇటు లంక వాసులు నరసాపురం రావాలంటే ఐదు కిలోమీటర్లు వెళ్లాలన్నారు. ఈ కారణంగా వారధి నిర్మించిన మాధవాయిపాలెం-సఖినేటిపల్లి పంటు మాత్రం యథావిధిగా తిరుగుతుందన్నారు. ఈ కారణాల దృష్ట్యా అక్కడ ప్రతిపాదించిన వంతెను రద్దు చేసి 2017లో కేంద్రం ఆమోదించిన విధంగానే వారధిని ఇసుక ర్యాంపు వద్ద నిర్మించాలని కోరారు. దీనికి మంత్రి వర్మ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

టి.నరసాపురం సొసైటీలో అవకతవకలపై విచారణ

టి.నరసాపురం, జూలై 6 : టి.నరసాపురం సొసైటీలో ఉద్యోగులు అవకతవ కలకు పాల్పడ్డారనే అభియోగంపై డీసీసీబీకి అందిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ అధికారి అల్లంశెట్టి శాంతకుమారి శనివారం విచారణ నిర్వహించారు. ఈ మేరకు డిపాజిట్‌దారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఖాతాదారులకు సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ విచారణ అధికారిణికి జనసేన మండల గ్రామ పంచాయతీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలేటి సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు.


బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

వర్జీనియా పొగాకు రికార్డు ధర రూ.375

జంగారెడ్డిగూడెం, జూలై 6 :పొగాకు ధరలు రోజురోజుకు పెరుగుతుం డడంతో రైతుల ముఖంలో ఆనందం వెల్లివిరుస్తుంది. శనివారం స్థానిక పొగాకు వేలం కేంద్రాల్లో కిలో పొగాకు ధర రూ.375కు చేరింది. రెండు రోజులుగా రూ.372 ధర నుంచి శనివారానికి రూ.375కు చేరిందని పట్టణంలోని రెండు వేలం కేంద్రాల అధికారులు నరేంద్ర కుమార్, శ్రీహరి తెలిపారు.



నేడు శ్రీవారి క్షేత్రానికి జగన్నాథుని రథం రాక

» లక్ష్మీపురంలో నేటి నుంచి 16వ తేదీ వరకు ఉత్సవాలు

ద్వారకాతిరుమల, జూలై 6: జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా లక్ష్మీపురం ఆలయం నుంచి సుభద్రా బలభద్ర సమేత జగన్నాథుడు ఆదివారం సాయంత్రం రథయాత్రగా శ్రీవారి క్షేత్రానికి రానున్నారు. ఈ మేరకు శనివారం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతు న్నాయి. ఏడాదికోసారి ఈవిధంగా జగన్నాథుడు క్షేత్రానికి రావడం సంప్రదాయం. ఈ నేపథ్యంలో ఇప్పటికే రథశాల నుంచి రథాన్ని ఉత్సవ నిర్వహణ నిమిత్తం బయటకు తెచ్చారు. ఉత్సవాల రోజుల్లో జగన్నాథుడు దశావతారాల్లో రోజుకో అలంకారంలో దర్శనమీయనున్నారు. ఈక్రమంలో మండపానికి చుట్టూ తెరలు కట్టిఆలయ సిబ్బంది సుందరీకరిస్తున్నారు. శ్రీవారి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమై ఈనెల 16వ తేదీ వరకు జరుగుతాయి. ఆఖరి రోజైన ఈనెల 16వ తేదీన సమీప గ్రామం తిమ్మాపురానికి రథయాత్ర వెళ్లివస్తుంది. ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తయినట్టు ఈవో త్రినాథరావు తెలిపారు.


ఉత్సవ నిర్వహణకు తెచ్చిన రథవాహనం


ఇంద్రప్రస్థం, మళ్లీ కలిసి జీవిద్దాం నాటికల్లో సన్నివేశాలు

కుటుంబ బంధాలు, బాధ్యతను తెలిపిన నాటికలు

ఏలూరు రూరల్, జూలై 6:ఏలూరు వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో జరుగుతున్న అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీలు అలరిస్తున్నాయి. మూడోరోజు శనివారం సందేశంతో పాటు వినోదాన్ని అందిస్తూ నాటక రంగానికి పూర్వవైభవం తెచ్చే దిశగా వైఎంహెచ్‌ఏ, హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నాయి. నటీనటులు తమ నటనతో ప్రేక్షక అభిమానులను కట్టిపడేశారు.

'మళ్లీ కలిసి జీవిద్దాం' నాటిక..

కుటుంబ బంధాలను గుర్తుచేస్తూ మళ్లీ కలిసి జీవిద్దాం నాటిక సందేశం ఇచ్చింది. సత్యనారాయణమూర్తి, లీలావతి దంపతులు వారి సంతానం చంద్రశేఖర్, గాయత్రితో ఎప్పుడో జరిగిన సంఘటన కారణంగా గ్రామంలోనే వేరేచోట ఒంటరిగా వండుకుని తింటూ ఉంటాడు సత్యనారాయణమూర్తి. భార్యకాలం చేసినా అతడి ఆలోచనలో మాత్రం ఆమె చనిపోలేదు. ప్రతి జ్ఞాపకాన్ని నెమరవేసుకుంటూ ఉంటాడు. జీవిత చరమాంకంలో భార్య లీలావతితో మళ్లీ కలిసి జీవించాలని, అతడి ఆశ. మనిషి ఆనందంగా బతకడానికి అనుభూతులు, జ్ఞాపకాలు ఎలా దోహదం చేస్తాయో చెప్పడమే మళ్లీ కలిసి జీవిద్దాం నాటిక చాటిచెప్పింది.

'ఇంద్రప్రస్థం' నాటిక..

అనంతరం అభినయ గుంటూరు వారిచే ఇంద్రప్రస్థం నాటిక ప్రదర్శించారు. ఈ నాటికలో కుటుంబ బాధ్యతలు మోసే తండ్రి గొప్పతనాన్ని ప్రతి కుమారుడు, కూతురు తెలుసుకోవాల్సిన అవసరం ఉందంటూ సందేశాత్మకంగా నాటిక ప్రదర్శన జరిగింది. కుటుంబాల్లో సభ్యుల మధ్య కనిపించే ప్రేమలు, హర్షించే విధంగా కనిపించాలే తప్ప అనాలోచితంగా పరిగెడితే జీవితం విలువలు నాశనం అవుతాయని, బాధ్యత కలిగిన తండ్రి ఉన్న కుటుంబాల్లోని ఇళ్లు ఇంద్రప్రస్థం మాదిరిగా వెలిగిపోతాయనే చక్కటి ఇతివృత్తంగా కళాకారులు నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, కోటేశ్వరరావు, కేబీరావు, వైద్యులు ఎంఎల్‌వీ ప్రసాద్, మానవతా నాగేశ్వరరావు, లంకా వెంకటేశ్వర్లు, కాంతారావు, ఖాజావలీ, గుత్తా కౌసలేంద్రరావు, పురుషోత్తం తదితరులు పర్యవేక్షించారు.

బంగారం షాపుల్లో ఘరానా మోసాలు

పాలకొల్లులో బంగారం చోరీకి యత్నం

» పట్టుబడిన మహిళ.. పోలీసులకు అప్పగింత

పాలకొల్లు అర్బన్, జూలై 6 : పాలకొల్లు పట్టణంలోని బంగారం షాపులో ఓ మహిళ చోరీకి యత్నించి పట్టుబడింది. స్థానిక శివాజీ జ్యూయలర్స్‌లో శనివారం సాయంత్రం ఓ మహిళ వచ్చి బంగారం ఆభరణాలు చూపించమని కోరింది. షాపు సిబ్బంది హడావుడిలో ఉండగా మహిళ కొన్ని నగలు కాజేసి వెళ్లిపోతుండగా సిబ్బంది అప్రమత్తమై పట్టుకున్నారు. ఆమెను నిర్బంధించి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఆమెది విజయవాడ అని చెబుతున్నట్టు షాపు సిబ్బంది ద్వారా సమాచారం. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు.


షాపులో చోరీకి పాల్పడిన మహిళ

» ఆకివీడులో నకిలీ ఆభరణాలు పెట్టి బంగారం చోరీ..

ఆకివీడు, జూలై 6: బంగారం దుకాణంలో ఘరానా మోసం జరిగింది. ఆకివీడులో పొట్టి శ్రీరాముల విగ్రహం సమీపంలో వున్న శ్రావణి జ్యూయలరీ షాపులోకి ఈనెల 4న మధ్యాహ్నం ఇద్దరు మహిళలు బంగారం వస్తువులు కొనుగోలు చేసేందుకు వెళ్లి నగలు దొంగతనం చేశారు. నగలను చూస్తున్నట్టు నటించి వాటి స్థానంలో నకిలీ ఆభరణాలు పెట్టి బంగారాన్ని ఎత్తుకెళ్ళారు. మహిళలు వెళ్ళిపోయిన తరువాత షాపు యజమానికి అనుమానం రావడంతో దుకాణంలో ఉన్న నగలను పరిశీలించారు. నకిలీ ఆభరణాలుండడంతో కంగుతిన్నాడు. సుమారు రూ.2.40 లక్షల విలువైన నగలు ఎత్తుకెళ్ళారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాలు పరిశీలించిన అనంతరం ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నగలను చూస్తున్న ఇద్దరు మహిళలు

క్రైం కార్నర్

వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

» మరో బాలుడికి గాయాలు

మొగల్తూరు, జూలై 6 : వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో బాలుడు తీవ్ర గాయాలైన ఘటన మొగల్తూరు మండలం కొత్తోట సమీపంలో శనివారం జరిగింది. మొగల్తూరు పోలీసులు తెలిపిన వివరాలివి.. కొత్తోట పంచాయతీ పరిధి చింతరేవు బ్రిడ్జి దిగువన బైక్‌ను ఎదురుగా వస్తును బొలెరో వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పె వెళుతున్న భీమవరం మండలం దొంగపిండి గ్రామానికి చెందిన రేవు ఏసు(20) అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌పై ఉన్న మరో బాలుడు తిరుమాని గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు ఎస్ఐ కె.వెంకట రమణ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 6 : ప్రేమ వ్యవహారంలో పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో మనస్తాపంతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలివి.. నిడదవోలుకు చెందిన బాదంపూడి మమత (22)తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుంది. కపిలేశ్వరపురానికి చెందిన తాతపూడి రాజేష్.. ఆమె ఇద్దరూ ప్రేమించుకున్నారు. రాజేష్‌కు ముందే పెళ్లి కావడంతో వారి పెళ్లికి యువతి పెద్దలు ఒప్పుకోలేదు. మనస్తాపానికి గురైన యువతి తాను పనిచేస్తున్న ఆసుపత్రి క్వార్టర్స్ వద్ద వీడియో కాల్‌లో రాజేష్‌కు చెబుతూ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటికే ఆమె ఇంటికి చేరుకుని కాపాడే ప్రయత్నం చేయగా కొన ఊపిరితో కొట్టుకోవడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిన విషయం విధితమే.. అక్కడ యువతి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

తాటిచెట్టు మీద పడి ఒకరి దుర్మరణం

లింగపాలెం, జూలై 6: లింగపాలెం మండలం బాదరాల గ్రామంలో తాటిచెట్టు మీదపడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ధర్మాజీగూడెం ఎస్ఐ పి.చెన్నారావు తెలిపిన వివరాలివి.. మండలంలోని కె.గోకవరం గ్రామానికి చెందిన ముంజుల రాంబాబు (30) అనేవ్యక్తి బాదరాలలోని ఓ రైతు పొలంలో తాటిచెట్లు నరకడానికి వెళ్ళినట్టు తెలిపారు. ఆ చెట్టుపైకి ఎక్కి తాడుకడుతుండగా తాటిచెట్టు ఒక్కసారిగా కిందపడి రాంబాబు మీదపడి ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉండి, జూలై 6 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఉండి ఏఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాలివి.. ఉండి మండలం వాద్రం గ్రామానికి చెందిన కలపాల సింహాద్రి (42) గతనెల 27 తేదీన గ్రామంలో కూలి పనికి వెళ్లి చెట్టుఎక్కి నరుకుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు మీదపడి తీవ్ర గాయాలపాల య్యాడన్నారు. వెంటనే ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం గుంటూరు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

చింతలపూడి, జూలై 6: ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చింతలపూడి నగర పంచాయతీ ఏలూరు రోడ్డుపై ఆయిల్ మిల్లు వద్ద శనివారం జరిగింది. ఎస్ఐ కుటుంబరావు తెలిపిన వివరాలివి.. సమ్మెటవారిగూడెం గ్రామానికి చెందిన పల్నాటి చంటి అనే వ్యక్తి ఫోన్ మాట్లాడుతూ మోటారుసైకిల్ నడుపుతుండగా ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. అతడిని చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స జరిపి మెరుగైన చికిత్స కోసం ఏలూరు తరలించినట్టు ఎస్ఐ కుటుంబరావు తెలిపారు.

శేషాచలంపై భక్తుడి బైక్ చోరీ

ద్వారకాతిరుమల, జూలై 6: శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చిన ఓ భక్తుని బైక్ శనివారం చోరీకి గురైంది. మండవల్లి మండలం కొవ్వాడలంకకు చెందిన జయమంగళ శివనాగరాజు ఉదయం కుటుంబసమేతంగా స్వామివారి దర్శనం నిమిత్త తన బైక్‌పై ద్వారకాతిరుమలకు వచ్చాడు. పార్కింగ్ ప్రాంతంలో బైక్‌ను ఉంచి దర్శనానంతరం బయటకు వచ్చి చూసేసరికి బైక్ కన్పించలేదు. పరిసరాల్లో వెతికినా ఫలితం దక్కలేదు. దేవస్థానం సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌ను చోరీ చేస్తున్న దృశ్యాలు కన్పించాయి. ఈ మేరకు బాధితుడు ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు.

మద్ది ఆంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే బొలిశెట్టి


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ కొండలరావు

జంగారెడ్డిగూడెం, జూలై 6: మద్ది ఆంజనేయస్వామిని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం కుటంబ సమేతంగా దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈఓ ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఈఓ శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు మద్ది దేవస్థాన అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఇందుకూరి రంగరాజు ఉన్నారు.

ఎంపీ మహేష్ యాదవ్‌కి సన్మానం


ఎంపీ మహేష్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘ నాయకులు వెంకట సుబ్బయ్య, తదితరులు

ఏలూరు టూ టౌన్, జూలై 6: ఏలూరు జిల్లాను ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్ అభివృద్ధి పదంలో నడిపిస్తారని రాష్ట్ర యాదవ సంఘ నాయకులు నెరుసు వెంకట సుబ్బయ్య యాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని మహేష్ నివాసంలో యాదవ సంఘ నేతలు తెలంగాణ యాదవ సంఘం నేతలు చక్రధర్ యాదవ్, తదితరులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే రోషన్‌కుమార్


కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి పుష్పగుచ్ఛం అందించిన ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడి, జూలై 6: జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ శనివావరం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని అనేక సమస్యలు ఉన్నాయని, వాటికి పరిష్కారం చూపించాలన్నారు. ప్రధానంగా చింతలపూడి ఎత్తిపోతల పథకం, రోడ్ల సమస్యలు, చింతలపూడిలో సెంట్రల్ లైటింగ్ సమస్య పలు సమస్యల పై ఆమె దృష్టిలో పెట్టారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మండవ లక్ష్మణరావు, గరిమెళ్ళ చలపతిరావు, ఎస్ఎల్ఎన్ రాజు పాల్గొన్నారు.

హోటల్ రంగం విస్తరిస్తోంది

ఏలూరు టూ టౌన్, జూలై 6: నగరంలో హోటల్ వ్యాపార రంగం విస్తరిస్తోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం అన్నపూర్ణ అథెంటిక్ హోటల్‌ను ఇరువురు ప్రారంభించారు. కార్యక్రమంలో రాము, గణేష్, నాని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పోలవరం జూలై 6 : ఇంటర్మీడియట్, పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ సజిని ఆధ్వర్యంలో శనివారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఏటా ఇలా నగదు ప్రోత్సాహకాలు అందించే దాతలు తరపట్ల వెంకటేశ్వరరావు, ఉమావల్లి దంపతుల చేతుల మీదుగా ప్రోత్సాహకాలను అందజేశారు. ఇంటర్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన పీతా మానస, ఎ.నిర్మల కుమారికి రూ. ఎనిమిది వేల చొప్పున, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన జి.పావనికి రూ.ఆరు వేల నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే పదో తరగతిలో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణులైన పోతుల అనూషకి రూ.12 వేలు, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన కె.రేవతికి రూ.ఎనిమిది వేలు ప్రోత్సాహకాలు అందజేశారు. 1965-1975 పదో తరగతి పూర్వ విద్యార్థులు కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, ప్రక్కి రవి, కర్రి తిరుపతి రావు, చెక్కా శ్రీరామ్మూర్తి, కోటంరాజు రాంబాబు, చిలకా రాంబాబు, నాళం గాంధీ, సోమరౌతు వెంకటేశ్వరరావు, నేరి సోమయాజులు, సర్వేశ్వరావు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంగణంలో పిచ్చి మొక్కల తొలగింపు

కుక్కునూరు, జూలై 6: అమరవరం బస్టాండ్ ప్రాంగణంలో కొన్నేళ్లుగా పిచ్చిమొక్కలు పెరిగి ప్రయాణికులు కనీసం కూర్చోవడానికి కూడా లేకుండా పోయింది. ఈ క్రమంలో టీడీపీ, జనసేన నాయకులు స్పందించి శనివారం బస్టాండ్ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. అలాగే పలు చోట్ల మంచినీటి ట్యాప్‌లు పని చేయకపోవడంతో వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాయకులు గోలమూడి శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

పెదపాడు, జులై 6 : వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, పిడుగులు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తులపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు భావన్నారాయణ సూచించారు. విపత్తులు, సీజనల్‌గా వ్యాపించే వ్యాధులపై తగు కార్యాచరణ నిమిత్తం మండల స్థాయి నాయకులతో తహసీల్దారు కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో తేజరతన్, వ్యవసాయాధికారి ప్రదీప్‌కుమార్, వైద్యాధికారి చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి

పోలవరం, జూలై 6 : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు కరిబండి నాగరనాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి, మండల అధ్యక్షులు కామిశెట్టి నాగరాజు, కక్కిరాల ప్రభాత్, తెల్లం విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించండి

ఏలూరు అర్బన్, జూలై 6 : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పీవో, ఏపీవో, వోపీవోలుగా విధులు నిర్వహించిన ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు శనివారం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రాన్ని అందజేశారు. తమ అభ్యర్థనపై సానుకూలంగా కలెక్టర్ స్పందించారని తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు, జిల్లాశాఖ అధ్యక్షప్రధానకార్యదర్శులు రామారావు, రెడ్డిదొర, ఉపాధ్యక్షుడు దొరబాబు తదితరులున్నారు.

విద్యార్థి కౌన్సిల్ ఎన్నిక

ఏలూరు అర్బన్, జూలై 6 : సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కౌన్సిల్ ఎన్నికలు శనివారం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ పి.సాయికుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ఆవశ్యకత, ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా ఈ ఎన్నికలు నిర్వహించినట్టు తెలిపారు. విజేతలుగా సీనియర్ విభాగంలో అశ్రిత్‌రామ్, బృంద, జూనియర్ విభాగంలో భార్గవ్, హాసిత గెలుపొందారన్నారు. విజేతలను కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్ అభినందించారు.

● ఉంగుటూరు : రాచూరు జెడ్పీ హైస్కూలులో శనివారం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయని బీవీఎస్ఎల్ అరుణాదేవి విద్యార్థి సంఘ నాయకుడి ఎన్నిక నిర్వహించారు. బ్యాలెట్ విధానంలో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగించుకొనేలా ప్రోత్సహించారు. 150మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ఎన్నికలలో పొగిరి నాగ చైతన్య(తొమ్మిదో తరగతి) 54 ఓట్లతో విజయం సాధించగా చిల్లా మిన్ని 31 ఓట్లతో రెండో విద్యార్థి నాయకుడిగా ఎన్నికయ్యారు. బాలికల ప్రతినిధిగా జె.మౌనిక, పి.పూర్ణ సత్య ఎంపికైనట్లు హెచ్ఎం విజయకుమార్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ఏక్‌పేడ్ మాకేనామ్

కామవరపుకోట, జూలై 6 : స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏక్‌పేక్‌మాకేనామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, అధ్యాపకులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

నీట్ పరీక్షల్ని రద్దు చేయాలని విద్యార్థుల ర్యాలీ

పోలవరం జూలై 6 : నీట్ పరీక్షల్ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యక్షుడు బన్నె వినోద్ డిమాండ్ చేశారు. విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించి స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో 67 మందికి 720కి 720 మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ప్రశ్నా పత్రాల లీకేజీలు అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు షేక్ అమీర్, కొయ్య సంతోష్, కుంజం అమర్‌నాథ్, గోరా షష్రక్ ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంటి


లింగపాలెంలో జగ్జీవన్‌రామ్‌కు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ నివాళి


తాడిచర్లలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఏలూరు టూ టౌన్, జూలై 6: భారత రత్న బాబు జగ్జీవన్‌రామ్ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 38 వర్ధంతి సందర్భంగా ఫైర్‌స్టేషన్ వద్ద ఉన్న ఆయన విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించటంపై ప్రముఖ అడ్వకేట్, టీడీపీ నాయకులు గొల్లపల్లి మురళీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఎం.అశోక్, టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జుంజు మోజేష్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డెవలప్మెంట్ చైర్మన్ నేతర అజయ్‌బాబు, దళిత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం : బాబూజగజ్జీవన్‌రామ్ వర్ధంతిని ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ భవనంలో బార్ అధ్యక్షులు అబ్బినేని విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా గవర్నమెంట్ ప్లీడర్ బి జనార్ధన్‌రెడ్డి, బార్ ఉపాధ్యక్షులు ప్రసాద్, బార్ స్పోర్ట్స్ సెక్రటరీ తిగిరిపల్లి సుబ్బారావు, కలపాల రవి పలువురు బార్ సభ్యులు పాల్గొన్నారు.

● లింగపాలెం : జగ్జీవన్‌రామ్ ఆశయాలకై పనిచేయటమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ధర్మాజిగూడెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● కామవరపుకోట : తాడిచర్లలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణులు, స్థానికులు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కిలారు సత్యనారా యణ, తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు వేముల హనుమంతు పాల్గొన్నారు.

● చింతలపూడి :స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పట్టణ శాఖ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు సొంగా ఏసుపాదం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్రహం, యోహాన్, రాయప్ప, నత్తా రవి, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : ఏలూరు రోడ్‌లో ఉన్న జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. నారా లోకేష్ యువజన ఫౌండేషన్ జిల్లా అధికార ప్రతినిధి అన్నపరెడ్డి గంగాధర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ అన్నపరెడ్డి గంగాధర్, కె.విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

తిన్నదంతా కక్కిస్తాం : ఎమ్మెల్యే చింతమనేని


సమావేశంలో పాల్గొన్న చింతమనేని

పెదవేగి, జూలై 6 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అక్రమాలను వెలికితీసి, అవినీతిపరులు తిన్న మొత్తాన్ని కక్కిస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాతారమ్మ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై ఆయా శాఖాధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ మయసభను మించిన మాయలతో నిధులను అడ్డంగా దోచేశారని ధ్వజమెత్తారు. ఎంపీడీవో వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే ప్రభాకర్ నివాళులర్పించారు.

వ్యాధుల పై అవగాహన ఉండాలి


లింగపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

లింగపాలెం, జూలై 6: వైద్యసిబ్బంది గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించాలని చింతలపూడి సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ అన్నారు. కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ పరిధిలో గల ఆసన్నగూడెంలో శనివారం ఆయన పర్యటించారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రత ను పాటించాలని అన్నారు. హెచ్ఎస్ ఉమ, హెల్త్ అసిస్టెంట్ చంద్ర శేఖర్, ప్రియాంక, ఏఎన్ఎం రేణుక, పార్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● భీమడోలు : మండలంలోని పూళ్ళ, కోడూరుపాడు, దుద్దేపూడి గ్రామాల్లో ఈవోపీఆర్డీ సుందరి పర్యటించి పారిశుధ్య పనులు, తాగునీటి ట్యాంకర్ల క్లీనింగ్, వాటర్ క్లోరినేషన్, పైపులైన్ల తదితర వాటిని పరిశీలించారు. డయేరియా నివారణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు ఉన్నారు.

● ఉంగుటూరు : గ్రామ పంచాయతీ తరఫున సిబ్బంది డయేరియా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ హాలులో గ్రామ సభ జరిగింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ బండారు సింధు మధు, మండల టీడీపీ అధ్యక్షులు పాతూరి విజయకుమార్, కార్యదర్శి కాకర్ల గిరిధర్ వార్డు సభ్యులు పాల్గొన్నారు

● ఏలూరు అర్బన్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో యాదవ నగర్, బడేటి నగర్, రాజరాజేశ్వరి నగర్, చొదిమెళ్ళ, సపోటాతోట వీధుల వెంబడివున్న డ్రైనేజీలు, నీటినిల్వ ప్రాంతాల్లో దోమలు, లార్వాల వ్యాప్తిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్‌ను జారవిడిచారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ వెంకటకృష్ణ, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్య మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తారెడ్డి త్వరగా కోలుకోవాలని పూజలు

టి.నరసాపురం, జూలై 6: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ టి.నరసాపురంనకు చెందిన టీడీపీ పోలవరం నియోజకవర్గం మాజీ వాణిజ్య విభాగం కోశాధికారి మండం ఆదిత్య కుమార్ తన మిత్రులతో కలిసి ఐఎస్ జగన్నాధపురం కొండ పై కొలువు తీరిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ బైపాస్ చేయించుకున్న ముత్తారెడ్డి కోలుకుని ప్రజలకు సేవ చేయటానికి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు.

శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నిడమర్రు జూలై 6 : శుద్ధి చేసిన తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధికారులను ఆదేశించారు. నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వ హించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ప్రగతి పై చర్చించారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెదనింద్రకొలను, నిడమర్రు, గుణపర్రులలో మంచి నీటి చెరువులు మరమ్మతులు, నిర్వహ న సొమ్ము బకాయిలు చెల్లించాలని సర్పంచ్‌లు అధికారులను కోరారు. సర్పంచ్‌లుకు రావాల్సిన బకాయిలును ఎం.బుక్ లలో నమోదు చేసి బిల్లులు తక్షణం విడుదల చేయాలని ఎమ్మెల్యే ధర్మరాజు ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే వ్యక్తిగత పనులపై వెళ్లగా అధికారులు సమావేశంకొనసాగించకుండా అర్ధంతరంగా ముగించేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ, ఎంపీపీ ధనకొండ ఆదిలక్ష్మీ, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పక ధరించాలి


సదస్సులో మాట్లాడుతున్న మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు క్రైం, జూలై 6 : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తకుమార్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో 'రోడ్డు ప్రమాదాల నివారణ' అనే అంశంపై డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అధ్యక్షత అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ ఎవరైనా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం నాథల పాలవుతుందన్నారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బుల్లి కృష్ణ, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మనీషా కుటుంబానికి పరామర్శ


మనీషా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకుల

జంగారెడ్డిగూడెం, జూలై 6 : శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త తానిగడప మనీషా ఇటీవల గుండెపోటుతో మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులను టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. జంగారెడ్డిగూడెం పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ రూ.మూడు వేలు, టీడీపీ సీనియర్ నాయకుడు అల్లూరు రామ కృష్ణ క్వింటా బియ్యం అందజేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, తూటిగుంట రాము, పోల్నాటి సత్యనారాయణ, ఎలికే ప్రసాద్, తదితరు లు పాల్గొన్నారు.

అచ్చాయమ్మకు నివాళి

కామవరపుకోట, జూలై 6 : టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న కంఠమనేనివారిగూడెంకు చెందిన కంఠమనేని అచ్చాయమ్మ మృతి చెందడంతో శనివారం సంతాప సభ నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, గుంటుపల్లి సర్పంచ్ గోరింక దాసు, కామవరపుకోట టీడీపీ అధ్యక్షులు వజీర్‌ఖాన్, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కరిపోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రాబిస్ వ్యాధి సోకితే ప్రాణానికే ముప్పు'


జీలుగుమిల్లిలో ఐటీడీఏ పీవో సూర్యతేజతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు


పెదవేగిలో కుక్కలకు టీకాలు వేయిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని


పెదపాడులో పెంపుడు కుక్కలకు టీకా వేస్తున్న డాక్టరు వాణీ సంధ్యశ్రీ

పెదవేగి, జూలై 6 : రాబిస్ వ్యాధి సోకితే ప్రాణానికి ముప్పని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెదవేగిలో పెంపుడు కుక్కలకు రాబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమానికి హాజరై టీకాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రారంభించి మాట్లాడారు. రాబిస్ వ్యాధితో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పశువులను పెంచుకుంటూ, అవే ఆధారంగా జీవించేవారు జీవాలకు బీమా చేయించి, ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ టి.గోవిందరాజు, ఏడీ డాక్టర్ఎస్.మోహన్‌బాబు, పెదవేగి పశువైద్యాధికారి డాక్టర్ ఎం.తారకేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరమణ, పెదవేగి, లక్ష్మీపురం సర్పంచ్‌లు తాతా శ్రీరామ్మూర్తి, మేకా కనకరాజు, పార్టీ నాయకులు తాతా సత్యనారాయణ పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : స్థానిక పశువుల ఆస్పత్రిని ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సందర్శించారు. సహాయ సంచాలకులు సాయిబుచ్చారావు ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాక్సిన్ వేశారు. ఈ క్రమంలో ఆస్పత్రి శిథిలావస్థలో ఉందని ఇప్పటికే పలు సార్లు జిల్లా ఉన్నతాధికారులకు సమస్య తెలియజేసినట్లు పశువైద్య సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఐటీడీఏ పీవో సూర్యతేజతో, సంబంధిత శాఖ డైరెక్టర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. పశు ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సుంకవల్లి సాయి, పశు వైద్యులు ఉన్నారు.

● పెదపాడు :స్థానిక పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలను వేశారు. పశువైద్యాధికారిణి వాణీ సంధ్యశ్రీ, టీడీపీ సీనియర్ నాయకులు బొప్పుడి కాశీబాబు, టీడీపీ నాయకులు గుత్తా అనిల్, మోరు శ్రావణి, గారపాటి రామసీత, లావేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు : జూనోసిస్ డే సందర్భంగా భీమడోలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్ వేశారు. పశువైద్యశాల ఏడీ సాయిరమేష్ వైద్యులు హరికృష్ణ, చలపతిరావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం : జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని పశు వైద్యశాలలో కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ లింగయ్య పశువైద్యులు డాక్టర్ మోహన్, డాక్టర్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆసుపత్రి ఆవరణలో కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ వైద్యులు లింగయ్య మాట్లాడుతూ పశువులకు తప్పనిసరిగా వాక్సిన్ వేయించాలని తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

ఏటిగట్ల పటిష్టతకు ముందస్తు చర్యలు తీసుకోవాలి


వరద సమీక్షలో పాల్గొన్న అధికారులు

పోలవరం, జూలై 6 : వరదలకు ఏటిగట్ల పటిష్టతకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తహసీల్దారు జీవీ ప్రసాద్ అధికారులకు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో శనివారం వరదలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం నుంచి గూటాల వరకూ ఏటిగట్టుకు అవసరమైన చోట్ల రక్షణ చర్యలు, కొవ్వాడ కాలువ పరిధిలో గట్టు పరిశీలన రక్షణ చర్యలు, కొండవాగుల ప్రభావిత ప్రాంతాలైన ఇటుకలకోట గ్రామ రక్షణకు ముందస్తు చర్యల అధికారులతో చర్చించి తగు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఏడు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, పాము కాటు, ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయని వింజరం వైద్యాధికారి మురళీధర్ తెలిపారు. కడమ్మ స్లూయిజ్ గేట్ల పనితీరు అంశాలపై దృష్టి పెట్టాలని తహసీల్దారు ఏజీఆర్‌బీ అధికారులకు సూచించారు. పోలీస్ అధికారులు అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు ముంపు ప్రజల్ని తరలించేందుకు తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అన్ని పంచాయతీలలో శానిటేషన్ పటిష్టంగా ఉండాలని సూచించారు. ఎంపీడీవో జి.శీను, ఎస్ఐ ఎస్ఎస్ఎస్ పవన్ కుమార్ , ఏజీఆర్‌బీ ఏఈ సునీల్ బాబు, ఎంఏవో రాంబాబు, హార్టికల్చర్ అధికారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 44 మందికి ఉద్యోగాలు

ఏలూరు అర్బన్, జూలై 6 : నేషనల్ కెరీర్ సర్వీసెస్, యువజన సర్వీసుల శాఖ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఎయిర్‌టెల్, లక్ష్మీకృష్ణ ప్రైవేటు లిమిటెడ్, బజాజ్ కేపిటల్, రెడ్డి అండ్ రెడ్డి మోటార్స్ కంపెనీల నుంచి హెచ్ఆర్ ప్రతినిధులు హాజరుకాగా మొత్తం 205 మంది హాజరయ్యారని, వీరిలో 44 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని సెట్‌వెల్ సీఈవో ముధుభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు గంటా సుదాకర్, ప్రవీణ్‌కృష్ణ, వరలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులను పట్టించుకోండి

వేలేరుపాడు, జూలై 6 : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య విజ్ఞప్తి చేశారు. సీపీఐ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వాసితులకు చేసిన అన్యాయాన్ని గుర్తించి నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అర్హులందరికి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు సీపీఐ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పోలవరం నియోజకవర్గ ఇంచార్జి కారం దారయ్య, జిల్లా నాయకులు సాయిబాబు, మండల కార్యదర్శి బాడిత రాము, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, రమణరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు రెన్యువల్ చేసుకోవాలి

టి.నరసాపురం, జూలై 6: కౌలు రైతులందరూ తమ గుర్తింపు కార్డులు రెన్యువల్ చేసుకోవాలని ఎంఏవో బి.సుమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2,700 మంది కౌలు రైతులు తమ గుర్తింపు కార్డులను రెన్యువల్ చేసుకోవాల్సి ఉందన్నారు. కొత్తగా నమోదు చేసుకోవాల్సిన కౌలు రైతులు, రైతు సేవా కేంద్రాల వద్ద అప్లికేషన్ పొంది స్థానిక వీఆర్వో ద్వారా కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని ఆమె తెలిపారు.

కమల్‌హాసన్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం

ఏలూరు రూరల్, జూలై 6 : కమల్‌హాసన్ నటించిన భారతీయుడు-2 చిత్రం ఈ నెల 12న దేశవ్యాప్తంగా విడుదల అవుతన్న సందర్భంగా కమల్‌హాసన్ అభిమానులు చిత్రం ఘన విజయం సాధించాలని కోరుతూ శనివారం పాలాభిషేకం చేశారు. ఆయన అభిమానులు మల్లిపూడి రాజు తదితరులు మాట్లాడారు. ఆది, రాఘవ, శ్యామ్, గోపి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుమన్‌ను కలిసిన బీసీ సంక్షేమ సంఘ నాయకులు


హీరో సుమన్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, జూలై 6: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు సుమన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలచారి ఆధ్వర్యంలో కలిసి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనతో చర్చించారు. సుమన్ మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించు కోవాలన్నారు. బీసీ కులాల్లో రాజకీయాలు ఉండకూడదని, ఐక్యతతో పనిచేయాలన్నారు. గాజుల బాజి, చప్పిడి సత్యనారా యణ, గోపాలకృష్ణ, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విటల్ కుమార్, పామర్తి ఏసురాజు, రాజు, నల్లపాటి రాజేష్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు నాసా బహుమతులు

జంగారెడ్డిగూడెం, జూలై 6 : నాసా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో ద్వారక అనే ప్రాజెక్టును సమర్పించిన శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులకు బహుమతులు లభించినట్లు ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులను ఎంఈవో బి.రాముడు శనివారం అభినందించి బహుమతులను అందజేశారు. ఏజీఎం పార్థసారథి, ఆర్ఐ ఉదయ్ భాస్కర్, కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఏఓ కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వారాహి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, జూలై 6 : సత్రంపాడులోని విశాఖ శారదా పీఠ పాలిత అంబికాదేవి ఆలయంలో ఈనెల 15వ తేదీ వరకు జరగనున్న వారాహి నవరాత్రి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ మాట్లాడుతూ విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ఆగమ శాస్త్ర, వైదిక కార్యక్రమ ప్రామాణికంగా వారాహి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కొత్తపేటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, జానకీ రామాంజనేయ గౌరీశంకర సాయి మందిరంలో ఏడు వారాల వ్రతాన్ని మహిళా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాలలో తనిఖీలు


భీమడోలు ఎరువుల దుకాణం పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

చింతలపూడి, జూలై 6: మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికా రులు శనివారం తనిఖీలు చేశారు. సరైన ధ్రువీకపత్రాలు లేని పురు గు మందులు 8.56 లక్షలు, వరి విత్తనాలు 5.08 లక్షల విలువైన వాటికి ఉత్తర్వులు ఇచ్చేవరకు అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు వి.జగదీశ్వరరెడ్డి, విజిలెన్స్ సీఐ నాగవెంకటరాజు తెలిపారు. చింతలపూడి ఏ.డి.ఏ నాగకుమార్, ఏవో మీనాకుమారి, టెక్నికల్ ఏవో ప్రవీణ్ పాల్గొన్నారు.

● భీమడోలు : మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఐ విల్సన్, విజయ్ ప్రసాద్, భీమడోలు ఏడీఏ ఉషారాజకుమారి, వ్యవసాయ అధికారులు తనిఖీల్లో పాల్గొని 25.21000 విలువ గల ఎరువుల అమ్మకాలను నిలిపివేశామన్నారు. ఈ దుకాణాల స్టాక్ రిజిస్టర్‌లను సీజ్ చేసి ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

● లింగపాలెం : ధర్మాజిగూడెంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపుల పై స్టేట్ విజిలెన్స్ టీమ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పురుగుమందులు, ఎరువుల షాపుల్లో సరైన రశీదులు లేని ఓ ఫాంస్, పీసీలు లేని ఎరువులు, విత్తనాలకు అమ్మకాలు నిలిపివేసినట్లు స్టేట్ విజిలెన్స్ టీమ్ ఏడీఏ జగ్గేశ్వరరెడ్డి తెలిపారు. నాసిరకం ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మితే అట్టివారి పై కఠిన చర్యలు తీసుకుంటామని నాసిరకం ఎరువులు అమ్మిన షాపుల లైసెన్స్‌లను రద్దు చేస్తామని వారు తెలిపారు. ఈ దాడుల్లో స్టేట్ విజిలెన్స్ టీమ్ ఏ.డి.ఏ జగదీశ్వరరెడ్డి, సీఐ నాగవెంకటరాజు, నాగకుమార్, ఎంఏవో మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు : ఎరువులు ,పురుగు మందులు, విత్తనాల దుకాణాలపై దాడులు జరిపారు. ద్వారకా తిరుమల, భీమడోలు, ఉంగుటూరు మండలం గొల్లగూడెంలోని గోద్రేజ్ ఆగ్రోవెట్ దుకాణంలోని సుమారు రూ.31.15 లక్షల విలువైన ఎరువులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో భాగంగా విజిలెన్స్ కమిటీలో ఏడీఏ విజయ ప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విల్సన్, భీమడోలు ఏడీఏ పి.ఉషా రాజకుమారి, మండల వ్యవసాయాధికారి బాలిన వెంకటేష్, వీఆర్వో పాల్గొన్నారు.


నూజివీడులో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద ముద్దరబోయిన నివాళి


అటపాకలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని


చనుబండలో నివాళులర్పిస్తున్న నాయకులు



ముదినేపల్లి, యనమదలలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు

యువతకు ఆదర్శం జగ్జీవన్‌రామ్

నూజివీడు టౌన్, జూలై 6: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని తన కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా మంత్రిగా ఆయన విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. హరితవిప్లవం జగ్జీవన్‌రామ్ వ్యవసాయశాఖా మంత్రిగా ఉన్నప్పుడే చోటుచేసుకుందన్నారు. నూజివీడు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తాళం వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు కందుల పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు. నూజివీడు మండలం యనమదలలో జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నూజివీడు మండల అధ్యక్షుడు ముసునూరి రాజా, సుంకొల్లు మాజీ సర్పంచ్ దొప్పలపూడి సాంబశివరావు, పంచాయతీ సభ్యులు సత్యనారాయణ, నరేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: బీహార్ రాష్ట్రంలో మారుమూల గ్రామంలో పేద దళిత కుటుంబంలో జన్మించి, దేశ ఉప ప్రధాని స్థాయికి ఎదిగిన బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చనుబండలో శనివారం ఆయన విగ్రహానికి నాయ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మోదుగు ముత్తయ్య తల్లాడ శ్రీనివాసరావు, గార్లపాటి మారేష్, విస్సంపల్లి ప్రసాద్, తేనేటి రాజేంద్ర,గద్దల కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: పేదల అభ్యున్నతికి మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ కృషి నేటి యువతకు ఆదర్శనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా అటపాకలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మి, కూటమి నాయకులు పూల రామచంద్రరావు, పెన్మెత్స త్రినాథరాజు, ఎండీ జానీ, కేవీఎస్ఎం నాయుడు, బావిశెట్టి నాగేశ్వరరావు, మంగినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని దళిత సంఘాల కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు, మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుల రహిత సమాజ నిర్మాణానికి ఆయన కృషి చేశారన్నారు. దళిత సంఘాల నాయకులు కత్తి ఏసేబు, ఏసుపోగు చినబాబు, మన్నె ప్రసాద్, కత్తి ప్రదీప్, కత్తి కోటేశ్వరరావు తదితరులు పాల్గొని జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. మాదిగ దండోరా కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ పరిశపోగు ప్రసాద్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు. దండోరా నాయకులు గుంటు మోహన్, కన్నా, కటికల దానియేలు, సిహెచ్.పద్మ, పి.విజయ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో శనివారం టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జగ్జీవన్ రామ్ చిరస్మరణీయుడని కొనియాడారు. కురేళ్ల గంగయ్య, ఈదా దుర్గారావు, సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాష్ట్రానికి అన్యాయం

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


మాట్లాడుతున్న రామకృష్ణ

నూజివీడు టౌన్, జూలై 6 : మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో రాష్ట్రానికి అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూజివీడు అమర్ భవన్‌లో రాష్ట్రస్థాయి మేధో మథన సమాలోచన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'పదేళ్ల మోదీ పాలనలో ఏ ఒక్క సమస్య పరిష్కరించ లేదు. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ఏ రాష్ట్రానికి లేని అవకాశం ఆంధ్రరాష్ట్రానికి ఉంది. టీడీపీ మద్దతు పార్లమెంట్‌లో, వైసీపీ మద్దతు రాజ్యసభలోనూ అవసరం ఉంది. రాష్ట్రంలో గొడవ పడుతున్న ఈ పార్టీల నాయకులు కేంద్రంలో మోదీకి సలామ్ కొడుతున్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ఇరుపక్షాలపై ఉంది. కమ్యూనిష్టు పార్టీలు కార్మికుల పార్టీలుగా గుర్తింపు పడ్డాయి. కార్మికులు, ఉద్యోగులు మెరుగైన జీవితాలు సాగిస్తున్నారంటే దానికి కారణం కార్మిక సంఘాల కృషి కారణం. కార్మికవర్గం ఆర్థిక అంశాలు సాధించుకోవడానికి ఎర్రజెండా పడుతున్నారు. కాని అనంత రం పలు మార్గాలను ఎంచుకుంటున్నారు. సమాజంలో మార్పు రావాలన్నా దేశ రాజకీయాలు మారాలన్నా, కార్మికవర్గం కమ్యూనిష్టు పార్టీల వైపు ఉండా లి. రాష్ట్రంలో గత ఐదేళ్లు నియంత పాలన సాగింది. వ్యవస్థలు అన్ని కుప్ప కూలి రాష్ట్రం అప్పుల పాలైంది'.. అని విమర్శించారు. రాష్ట్ర ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, జి.ఓబులేషు, రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.


ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

'ఉపాధి'లో అవకతవకలు

ప్రజా వేదికలో పలువురు ఫిర్యాదు

పునర్విచారణకు శాప్ డైరెక్టర్ ఆదేశాలు

ముదినేపల్లి, జూలై 6 : మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 2023-24 సంవత్సరంలో మండలంలో జరిగిన రూ.9 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు, సామాజిక భద్రతా పెన్షన్ల మంజూరు, పంపిణీ తదితర అంశాలపై ఏపీ శాప్ డైరెక్టర్ ఎం.జగదీష్ కుమార్, డ్వామా పీడీ ఏ.రాము, జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, ఎంపీడీవో ఎస్.మురళీ గంగాధరరావు మండల స్థాయి ప్రజా వేదిక నిర్వహించి, పనులపై విచారించారు. ఈ సందర్భంగా మండలంలోని కొరగుంటపాలెం, చిగురుకోట గ్రామాల్లో ఉపాధి పనుల నిర్వహణలో అక్రమాలు జరిగాయని, పంట బోదెల తవ్వకాలు, ఇతర పనుల్లో నాణ్యత లేదని, పనులకు రాని కూలీలను కూడా మస్టర్‌లో చూపించి ఫీల్డ్ అసిస్టెంట్లు సొమ్ము డ్రా చేశారని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహన్‌రావు, కొరగుంటపాలెం టీడీపీ నాయకుడు బత్తుల రవితోపాటు పలువురు గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పై గ్రామాల్లో జరిగిన పనులపై తిరిగి సామాజిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడికక్కడే చిగురుకోట, కొరగుంటపాలెం గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులపై తిరిగి విచారణ జరిపించాలని శాప్ డైరెక్టర్ జగదీష్ కుమార్ ఆదేశించారు. మరి కొన్ని గ్రామాల్లోను పనుల నిర్వహణపై ఫిర్యాదు అందాయి. ఉపాధి నిధులు దుర్వినియోగం జరిగినట్లు రుజువయితే కఠిన చర్యలు తీసుకుంటామని అవకతవకలు జరిగితే సొమ్మును ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేస్తామని డ్వామా పీడీ హెచ్చరించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, డ్వామా ఏపీడీ జి.సుధాకర్, ఉపాధి మండల ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థలాల పంపిణీలో అవకతవకలపై విచారణ జరపాలి



చాట్రాయి, జూలై 6: జనార్ధనవరంలో వైసీపీ హయాంలో ఇళ్ళ స్థలాల పంపిణీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని శనివారం తహసీల్దార్ మహ్మద్ ముక్బూద్ అలీకి, తెలుగు మహిళా నాయకురాలు మాదాసు చంద్రకళ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు వినతిపత్రాలు ఆందజేశారు. వైసీపీ నాయకులు ఇళ్ళు ఉన్న అనర్హులకు పట్టాలు ఇచ్చి అర్హులకు అన్యాయం చేశారని విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాన్ని పూర్తి చేయాలని ఎంపీడీవో మంగా కుమారికి వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు వంగల సుబ్బారావు, చిన్న పుల్లయ్య, పామర్తి నాగరాజు, బలుసూరి రత్తయ్య పాల్గొన్నారు.

చాట్రాయి మండలానికి మహర్దశ


బొట్టు లక్ష్మణరావు

చాట్రాయి, జూలై 6: కూటమి పాలనలో, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సారథ్యంలో నూజివీడు నియోజకవర్గానికి, చాట్రాయి మండలానికి మహర్దశ రానున్నదని టీడీపీ మండల నాయకుడు బొట్టు లక్ష్మణరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రూ. 4900 కోట్లతో చేపట్టి 70 శాతం పనులు పూర్తి చేయగా వైసీపీ అధికారంలోకి వచ్చి 5 ఏళ్లలో తట్ట మట్టి వేయకుండా శిథిలావస్థకు చేర్చిందన్నారు. అలాగే తమ్మిలేరు ఆధునికీకరణకు టీడీపీ రూ. 16 కోట్లు జపాన్ బ్యాంకు నిధులు మంజూరు చేయగా వైసీపీ అరకొర పనులు మాత్రమే చేసి రైతులకు అన్యాయం చేసిందన్నారు. చాట్రాయి మండలంలో 90 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, మెట్ట భూములకు సాగునీరు అందిస్తేనే ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. హామీల అమలుకు మంత్రి పార్థసారథి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారని త్వరలోనే కార్యరూపం దాల్చుతాయని, చింతలపూడి ఎత్తిపోతల పథకం, తమ్మిలేరు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు పునః ప్రారంభానికి కృషి జరుగుతున్నదని అన్నారు.

వడాలిలో డ్రగ్స్ రహిత ర్యాలీ

ముదినేపల్లి, జూలై 6 : వడాలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్, హైస్కూల్ హెచ్ఎం ప్రభుదాసు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు వడాలిలో గంజాయి జోలికి వెళ్లొద్దు - భవిష్యత్తును పాడుచేసుకోవద్దు అంటూ నినాదాలు చేశారు. గంజాయి అమ్మేవారిని పట్టించిన వారికి బహుమతి ఇస్తామని డాక్టర్ మనోజ్ ప్రకటించారు.


మండవల్లి గ్రామసభలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

మండవల్లి, జూలై 6: అధికారులు, నాయకులు హాజరుకాని గ్రామసభ వల్ల ప్రయోజనం లేదని ప్రజలు గ్రామసభలవైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి. అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండవల్లిలో సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన శనివారం జరిగిన గ్రామసభలో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శి తోట శ్రీనివాసరావు గ్రామ సభలో పలు విషయాలపై చర్చించారు. పలువురు మండల స్థాయి అధికారులు హాజరుకాకపోవడం, 12 మంది వార్డు మెంబర్లకు నలుగురే హాజరు కావటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామసభలకు హాజరుకాని అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులకు తెలియపరచాలని ఎంపీపీ రాము కార్యదర్శికి సూచించారు. తరుగుమూల నివేశన స్థలాల ఒరిజినల్ పట్టాలను వారం రోజుల్లో లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారని టీడీపీ కార్యకర్త నల్ల వెంకటేశ్వరరావు గ్రామసభలో తెలపడంతో లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. దళితవాడలో రేవు నిర్మాణం, విద్యుత్ లైన్ పొడిగింపు, శ్మశాన వాటిక రోడ్డు నిర్మాణం, జలజీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని భాస్కరరావు కోరారు. పోలీసు స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయింపుపై చర్చ జరిగింది. కానుకొల్లు పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం గ్రామసభ నిర్వహించి గ్రామ సమస్యలపై చర్చించారు. సర్పంచ్ థామస్ అధ్యక్షతన సభ జరిగింది.

రాష్ట్రానికి భారీగా నిధులు సాధించాలి

చాట్రాయి, జూలై 6: కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడటానికి దోహదపడిన ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించేలా మోదీపై ఒత్తిడి తేవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, వెనుకబడిన ప్రాంతాలకు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ కోసం పోరాడాలని హరనాథ్ కోరారు. సీఎం చంద్రబాబు నిధులు రాబట్టకపోతే తాను ప్రకటించిన పథకాల అమలుకు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

శిక్షణ తరగతులను పరిశీలించిన డీఈఓ



కైకలూరు, జూలై 6: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో నైపుణ్యాన్ని పెంచడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం అన్నారు. శనివారం కైకలూ రు మండల విద్యా శాఖా కార్యాలయంలో ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షా విద్యా నైపుణ్య శిక్షణ తరగతులను పరిశీలించి మాట్లాడుతూ ఈ తరగతుల వల్ల విద్యార్థుల స్థాయికి తగినట్లుగా బోధన మెరుగుపరుచుకోవచ్చన్నారు. ఎంఈఓలు డి. రామారావు, వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో సీఎన్జీ బంక్ ఏర్పాటు చేయాలి

ఆగిరిపల్లి, జూలై 6: తమ ఆటోలకు గ్యాస్ ఫిల్లింగ్ కోసం 34 కిలోమీటర్ల ప్రయాణం చేయవలసి వస్తుందని, సీఎన్జీ ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. నూజివీడులో సీఎన్జీ ఫిల్లింగ్ బంకు లేకపోవడం వల్ల నూజివీడుకు ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న రామన్నగూడెం గ్యాస్ బంకుకు రావాల్సి వస్తుందని, అక్కడ అక్షయ ఫిల్లింగ్ స్టేషన్ ప్రతిసారి రిపేరు రావడం వల్ల అక్కడి నుంచి ఈదులగూడెం రోడ్డులో 12 కిలోమీటర్లు ప్రయాణించి ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్లలో గల మెగా గ్యాస్ కంపెనీ వరకు రావాల్సి వస్తున్నదని, తిరిగి నూజివీడు వెళ్లేందుకు రానుపోను 34 కిలోమీటర్లు దూరం గ్యాస్ కోసం ప్రయాణిస్తుంటే తమకు మిగిలేది ఏమీ ఉండదని, దయచేసి నూజివీడులో సీఎన్జీ బంక్ నిర్వహించాలని ఆగిరిపల్లి మెగా గ్యాస్ కంపెనీకి వినతిపత్రం సమర్పించారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కరిస్తానని మేనేజర్ రవికిరణ్ తెలిపారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి : ఎంఈవో

ముసునూరు, జూలై 6: విద్యార్థులు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంఈవో సుబ్బారావు అన్నారు. శనివారం చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో మరుగుదొడ్లు, మంచినీటి ట్యాంకును పరిశీలించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, మంచినీటి ట్యాంకును క్లోరినేషన్ చేసి, స్వచ్ఛమైన నీటిని విద్యార్థులకు అందించాలని ఎంహెచ్ అబ్బాస్‌కు, ఉత్తమ బోధనతో విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.



శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

కైకలూరు, జులై 6: భారతీయ జన్ సంఘ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం కైకలూరులో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ అప్పటి ప్రధాని నెహ్రూతో విబేధించి 1950లో తన మంత్రి పదవికి రాజీనామా చేసి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సహకారంతో 1951లో భారతీయ జన్ సంఘ్ ప్రస్తుత బీజేపీని స్థాపించారన్నారు. నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రామంప్రసాద్, పార్టీ నాయకులు కట్టా వీరరాఘవులు, బొల్లా శ్యామలరాజు, బోయిన బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులే



ఆగిరిపల్లి, జూలై 6: విద్యార్థులను అత్యున్నత వ్యక్తులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో గల హీల్ స్కూల్లో ఉపాధ్యాయులకు నిర్వహించిన శక్తి సామర్థ్యం అభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా ప్రసంగించారు. విద్యార్థుల మానసిక స్థితిలో చైతన్యం తేవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మానవత పశ్చిమగోదావరి జిల్లా ఎడ్యుకేషనల్ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, ప్రిన్సిపాల్ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి మరమ్మతులు

కలిదిండి, జూలై 6 : గోతులు పడి అధ్వానంగా ఉన్న లంక గ్రామాల ప్రధాన రహ దారి మరమ్మతుల పనులు శరవేగంగా సాగుతున్నాయి. గుర్వాయిపాలెం నుంచి పెదలంక వరకు 16 కిలోమీటర్ల మేర ఎక్స్‌వేటర్‌తో రహదారిపై పడిన గోతులను చదును చేస్తూ కంకర వేస్తున్నారు. ఎమ్మెల్యే కామినేని చొరవతో కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు చేస్తుండటంతో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో లంక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


చీపురుగూడెంలో కచ్చా డెయిన్లు పూడిక పనులు

చాట్రాయి, జూలై 6: చీపురుగూడెంలో పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. గ్రామంలో విషజ్వరాలు ప్రబలటంతో 4న మంత్రి కొలుసు పార్థసారథి గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య లోపంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు గ్రామంలో చెత్త కుప్పలు తొలిగించి బ్లీచింగ్ చల్లించారు. కచ్చా డెయిన్లలో పూడిక, మురుగునీటి నిల్వలు తొలగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని, దోమతెరలు వాడాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే చికిత్స తీసుకోవాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: మండలంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముసునూరులో డెంగీ కేసు నమోదు కావడంతో పారిశుద్ధ్యంపై సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మియా, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. యల్లాపురంలో దోమల నివారణకు సర్పంచ్ మొక్కపాటి మురళీకృష్ణ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అన్ని కాలనీల్లో ఫాగింగ్ చేయించారు. కొర్లకుంటలో పైప్‌లైన్ లీకేజ్ సమస్య పరిష్కారానికి కార్యదర్శులు ప్రసాద్, రాకేష్‌లు చర్యలు తీసుకున్నారు. వేల్పుచర్ల, రమణక్కపేట గ్రామాల్లో డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ సత్యప్రసాద్ పర్యవేక్షణలో అన్ని గ్రామాల్లో ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేశారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. పారిశుధ్యంపై పంచాయ తీ, సచివాలయ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

ముసునూరు, జూలై 6: చింతలవల్లిలో డయేరియాపై అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజకుమారి ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, ఆహారాన్ని వేడిగా భుజించాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. వాంతులు, విరేచనాలు అవుతుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ



కలిదిండి, జూలై 6 : పెదలంకలో శనివారం ఆది వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోకల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు రూ.10 వేల విలువ గల ఉచిత నోటు పుస్తకాలను ఆది వెలమ మండల అధ్యక్షుడు అక్కల బోసు పంపిణీ చేశారు. సంఘ నాయకులు దుగ్గిరాల రంగారావు, కోకా పాండు రంగారావు, నాగేశ్వరరావు, దున్న భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అమ్మవారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆగిరిపల్లి మేఘ గ్యాస్ హెచ్ఆర్ డీవీ సుధాకర్ ఆర్థిక సాయంతో పలకలు, బలపాలు, నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. తహసీల్దార్ మృత్యుంజయరావు, ఈవోపీఆర్డీ శేఖర్, విద్యాశాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద కుమార్, అమ్మవారిగూడెం సర్పంచ్ కొండలరావు చేతులమీదుగా పంపిణీ చేశారు.

మండవల్లి: అల్లినగరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గుడివాడకు చెందిన దాత మేక రాయుడు, టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఎన్డీయే నాయకులు అట్లూరి భవానీప్రసాద్, ముళ్లపూడి సత్తిబాబు, రఫీబా, శరత్‌బాబు, నారగం రామకృష్ణ పాల్గొన్నారు.


కైకలూరు, కలిదిండి, నూజివీడు, ముసునూరు, చాట్రాయిలో పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

విద్యార్థినిని కబళించిన కేన్సర్


ప్రీతి (ఫైల్)

చాట్రాయి, జూలై 6: మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని వెల్ది ప్రీతి(20) కేన్సర్‌తో పోరాడి శనివారం మంగళగిరి ఎన్నారై ఆసుపత్రిలో కన్నుమూయటంతో గ్రామంలో విషాదం నెలకుంది. టీడీపీ సీనియర్ నాయకుడు వెల్ది నాగేశ్వరరావు సోదరుడు సత్యనారాయణ మనుమరాలైన ప్రీతి గుంటూరు ప్రైవేట్ కాలేజిలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. 2 నెలల క్రితం ఆమెకు బ్లడ్ కేన్సర్ బయటపడటంతో ఎన్నారై ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రీతి మృతి చెందటంతో ఆమె కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శనివారం కొత్తగూడెంలో ప్రీతి అంత్యక్రియలు జరిగాయి.

క్రైం సమాచారం

పామాయిల్ రైతుపై దాడి.. ఆరుగురిపై కేసు

ముసునూరు, జూలై 6: పామాయిల్ రైతును నిర్బంధించి దాడి చేయడంతోపాటు నగదు డిమాండ్ చేసి తీసుకున్న ఆరుగురిపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వాసు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కోల్లూరి రామకృష్ణారావుకు బాపులపాడు మండలం మడిచర్ల గ్రామంలో 339-1బి సర్వేనెంబర్‌లో ఉన్న 4 ఎకరాల పామాయిల్ తోట ఉంది. అయితే ముసునూరు మండలం చిల్లబోయినపల్లికి చెందిన కందేపు ప్రకాశరావు అనే వ్యక్తి దొంగతనంగా పామాయిల్ గెలలను కోసుకుని అమ్ముకుంటున్నాడని సహచర రైతుల ద్వారా రామకృష్ణారావుకు తెలిసింది. దీంతో మే 11వ తేదీ సాయంత్రం ప్రకాశరావు ఇంటికి వెళ్ళిన రైతు రామకృష్ణారావు దీనిపై నిలదీయగా ప్రకాశరావుతో పాటు కందేపు వెంకటేశ్వరావు(జిన్నియ్య), తమ్మినేని లక్ష్మీ నారాయణ, కొండపావులూరి సంపత్‌కుమార్, కాగిత గంగధరరావు, సురేష్ రామకృష్ణారావును కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డారు. అతని వద్ద ఉన్న రూ. 50 వేలు నగదు, సెల్‌ఫోన్, కారు తాళాలు తీసుకుని, మరో లక్ష రూపాయలు ఇస్తేనే వదులుతామని బెదిరించారు. దీంతో రామకృష్ణారావు తన భార్య ఖాతా నుంచి రూ. 50 వేలు, మేనల్లుడు సాదాని మహేందర్ ఖాతా నుంచి మరో రూ. 50 వేలు వారి ఖాతాల్లోకి బదిలీ చేయించాడు. తరువాత ప్రామిసరీ కాగితాలపైన సంతకాలు పెట్టాలని అతనిని బలవంతం చేసి ఈ విషయాన్ని ఏవరికైనా చెబితే నిన్ను, నీ కుటుంబసభ్యులను చంపేస్తామని బెదించి, మరుసటి రోజు తెల్లవారుజామున వదిలి వేశారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

రేబిస్‌తో తస్మాత్ జాగ్రత్త

» జూనోసిస్ డే సందర్భంగా అవగాహన

» పెంపుడు కుక్కలకు టీకాల పంపిణీ

కైకలూరు, జూలై 6: జంతువులు నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులపట్ల అప్రమత్తం చేసేందుకే జూనోసిస్ డే నిర్వహిస్తున్నారని కైకలూరు పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ముస్తాఫా ఖాన్ అన్నారు. శనివారం జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ అందజేశారు. సీతనపల్లిలో 52, గుమ్మళ్లపాడులో 42, కైకలూరు పశువైద్యశాలలో 106 పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ అందజేసినట్లు తెలిపారు. మరో మూడు రోజులపాటు ఈ వ్యాక్సిన్ కార్యక్రమం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ లెక్చరర్ డాక్టర్ ఎం. విజయకుమార్, డాక్టర్ వి. సంధ్య, పశువైద్యాధికారులు డాక్టర్ గణేష్, లీలా ఉషారాణి, మహ్మద్ బాజీ, షేక్ గని, శ్రీనివాసు పాల్గొన్నారు.

కలిదిండి: జూనోసిస్ డే సందర్భంగా కలిదిండి పశువైద్యశాల వద్ద శనివారం మండల పశువైద్యాధికారి ప్రహర్ష పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేశారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు.

నూజివీడు టౌన్: నూజివీడు పశు వైద్యశాలలో కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను అందించారు. నూజివీడు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ కె.చంద్రశేఖర్‌రావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై వివరించారు. ప్రధానంగా కుక్కల వల్ల రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందుతుందని, ప్రతి ఏటా కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలను వేయించాలని సూచించారు. కాగా శనివారం 386 కుక్కలకు టీకాలు వేశారు. నూజివీడు, ఆగిరిపల్లి మండల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: శనివారం ముసునూరు పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలను వైద్యాధికారి కృష్ణచైతన్య వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకాలను వేయించాలని సూచించారు. మండలంలోని 118 మంది పెంపుడు కుక్కలకు టీకాలను వేసినట్లు తెలిపారు.

చాట్రాయి: పశు వైద్యాధికారి శివ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పశు సంవర్థకశాఖ సిబ్బంది పెంపుడు కుక్కల వాక్సిన్లు వేశారు. ప్రభుత్వం నుండి 300 డోసులు రాగా శనివారం వ్యాక్సిన్లు వేశామని, ఆదివారం కూడా వాక్సినేషన్ కొనసాగుతుందని పశు వైద్యాధికారి చెప్పారు. జంతువుల నుండి మనుషులకు వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వారాహి అమ్మవారి నవరాత్రులు ప్రారంభం

ముదినేపల్లి, జులై 6 : వారాహి అమ్మవారి నవరాత్రులు శనివారం ప్రారంభమయ్యాయి. ముదినేపల్లి ప్రాంతంలోని పలువురు మహిళలు తమ గృహాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ నవరాత్రులను ఈ నెల 15 వరకు భక్తులు నిర్వహిస్తారు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి లలితా సహస్ర నామ పారాయణం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



కైకలూరు, జూలై 6: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని కొల్లేటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి బి. శంకర్ అన్నారు. శనివారం భుజబలపట్నంలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస గృహాల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. సర్పంచ్ గురజాల వేణు, సెక్రటరీ రవికిరణ్, ఏఎన్ఎం నాగేశ్వరమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయితేజ, వైద్య సిబ్బంది చక్రపాణి, బుంగా కీర్తి తదితరులు పాల్గొన్నారు.